
ఆంధ్రజ్యోతి




ANDHRAJYOTHY
ఖమ్మం
KHAMMAM
శనివారం, 5 జూలై 2025

ఆయకట్టులో ఆశలు



కూసుమంచి సమీపంలో వరినాట్లకు దమ్ముచేస్తున్న దృశ్యం

- 'కృష్ణా'కు వస్తున్న వరదతో రైతుల్లో ఆనందం
- పరివాహక ప్రాంతంలో నిండుతున్న ప్రాజెక్టులు
- ఎన్నెస్పీ పరిధిలో సాగుకు ఢోకా ఉండదని ధైర్యం
- వారం రోజుల్లో శ్రీశైలం నుంచి సాగర్‌కు నీటి విడుదలకు అవకాశం



నాగార్జున సాగర్ జలాశయం (ఫైల్)

కూసుమంచి, జూలై 4 (ఆంధ్రజ్యోతి): కృష్ణా పరివాహక ప్రాంతంలో భారీ వర్షాలు పడుతుండటం.. ఎగువ నుంచి ప్రాజెక్టులకు వరద వస్తుండటం.. ప్రస్తుతం శ్రీశైలానికి నీరు పరవళ్లుతొక్కుతుండటంతో నాగార్జున సాగర్ ప్రాజెక్టు అయకట్టులో ఆశలు పెరుగుతున్నాయి. ఎగువ నుంచి కృష్ణానదికి భారీగా వరద నీరు వచ్చి చేరుతుండటంతో ఈసారి వరిసాగుకు ఢోకా ఉండదన్న ధైర్యంతో రైతులు సాగు పనులను ముమ్మరం చేస్తున్నారు. ఎగువన కర్ణాటక కర్ణాటక రాష్ట్రంలో కురుస్తున్న భారీ వర్షాలతో అల్మట్టి, నారాయణపూర్, జూరాల, శ్రీశైలం ప్రాజెక్టులు నిండుకుండల్లా మారాయి. శ్రీశైలానికి భారీగా వరదనీరు వస్తుండగా.. ప్రస్తుతం విద్యుత్ ఉత్పత్తికి విడుదల చేస్తున్న నీరు సాగర్‌ను చేరుతోంది. మరో వారంలో గేట్ల ద్వారా సాగర్ డ్యామ్‌కు నీటిని విడుదల చేసే అవకాశాలు కన్పిస్తున్నాయి.

నెల ముందే కృష్ణమ్మ పరవళ్లు

సాధారణంగా ఆగస్టులో కృష్ణా పరివాహకంలోని ప్రాజెక్టులు నిండుతాయి. గతేడాది మాదిరి ఈ ఏడాది కూడా జూలై నెలలోనే ప్రాజెక్టుల్లో నీరు చేరి నిండిపోయాయి. జూరాల ప్రాజెక్టు నుంచి 76,841 క్యూసెక్కుల నీటి ప్రవాహం శ్రీశైలం ప్రాజెక్టుకు వస్తుంది. శ్రీశైలం ప్రాజెక్టులో గరిష్ఠ నీటిమట్టం 885 అడుగులకుగాను 875.90 అడుగులకు చేరింది. శ్రీశైలం ఎడమగట్టు విద్యుత్ కేంద్రం నుంచి 35,315, కుడిగట్టు విద్యుత్‌కేంద్రం నుంచి 32,830 క్యూసెక్కుల నీరు దిగువ సాగర్‌కు వదులుతున్నారు. శ్రీశైలానికి మొదట్లో లక్ష క్యూసెక్కులకు పైగా వరద రాగా ప్రస్తుతం కొంత తగ్గింది. ప్రాజెక్టు పూర్తిస్థాయి నీటి నిల్వ సామర్థ్యం 215.8 టీఎంసీలు కాగా ప్రస్తుతం 166.31 టీఎంసీలుగా ఉంది. విద్యుదుత్పత్తి పేరుతో నీరు విడుదల చేస్తున్నా, మరో వారం రోజుల్లో క్రస్ట్‌గేట్లు ఎత్తే అవకాశం ఉందని నీటిపారుదల అధికారులు అంచనా వేస్తున్నారు. నాగార్జునసాగర్ గరిష్ఠ నీటిమట్టం 590 అడుగులు కాగా (మిగతా 6వ పేజీలో)

సాగర్ నుంచి పాలేరుకు జలాలు

తాగునీటి అవసరాల కోసం విడుదల

జిల్లా తాగునీటి అవసరాలకోసం సాగర్ నుంచి పాలేరు జలాశయానికి శుక్రవారం అధికారులు నీటిని విడుదల చేశారు. ఖమ్మం జిల్లా వాసుల తాగునీటి అవసరాల కోసం ఐబీ అధికారలు ప్రతిపాదనలు పంపిన నేపథ్యంలో సాగర్ డ్యాం నుంచి 3 వేల క్యూసెక్కుల నీటిని అధికారులు శుక్రవారం విడుదల చేశారు. ఆదివారం ఉదయానికి పాలేరు జలాశయాన్ని చేరుకునే అవకాశం ఉంది. పాలేరు జలాశయ గరిష్ఠ నీటి మట్టం 23అడుగులకు గాను 12.50 అడుగుల మేర నీరు నిల్వ ఉంది.



పాలేరు రిజర్వాయర్

రామాలయంలో మరింత భద్రత



కొత్త పరికరాలతో భక్తులను తనిఖీ చేస్తున్న ఎస్పీఎఫ్ సిబ్బంది

- కొత్తగా 2 డీఎఫ్ఎండీ, 6 హెచ్‌హెచ్‌ఎండీ పరికరాల కొనుగోలు
- ఎస్పీఎఫ్ సిబ్బందితో భక్తుల తనిఖీలు ప్రారంభం

భద్రాచలం, జూలై 4 (ఆంధ్రజ్యోతి) : భద్రాచలం సీతారామచంద్రస్వామి ఆలయంలో భద్రతను మరింత కట్టుదిట్టం చేశారు. ఇందుకోసం దేవస్థానం అధికారులు రూ.7లక్షలతో కొత్తగా రెండు డోర్ ఫ్రేమ్ మెటల్ డిటెక్టర్ (డిఎఫ్ఎండీ), ఆరు హ్యాండ్ హెల్డ్ మెటల్ డిటెక్టర్ల(హెచ్‌హెచ్‌ఎండీ)ను కొనుగోలు చేశారు. వీటిని ఎస్పీఎఫ్ సిబ్బంది శుక్రవారం నుంచి వినియోగిస్తున్నారు. రామాలయంలోని రాజగోపురం ద్వారా భక్తులు ఆలయ ప్రాగణంలోకి ప్రవేశించే మార్గంలో ఒకటి, ఉత్తర ద్వారం ద్వారా వచ్చే భక్తుల కోసం మరొకటి డీఎఫ్ఎండీలు ఏర్పాటు చేశారు. అలాగే భక్తులను తనిఖీ చేసేందుకు ఆరు హెచ్ఎండీ పరికరాలను ఎస్పీఎఫ్ సిబ్బంది వినియోగిస్తున్నారు. అయితే గతంలో ఈ పరికరాలు ఆలయంలో ఉండగా అవి కాలంచెల్లడంతో వినియోగానికి అనువుగా లేవు. దీంతో ఎస్పీఎఫ్ సిబ్బంది భద్రతా చర్యలు కోసం కొత్త పరికరాలు కావాలని దేవస్థానం అధికారులకు గతంలో కోరారు. ఈ నేపథ్యంలో దేవస్థానం అధికారులు ఈ పరికరాలను కొనుగోలు చేసి ఎస్పీఎఫ్ సిబ్బందికి అందజేసింది. దీంతో ఇకనుంచి ఆలయంలోకి ప్రవేశించే భక్తులను మరింతగా తనిఖీ చేసే వెసులుబాటు ఎస్పీఎఫ్ సిబ్బందికి లభించింది. ఇదే సమయంలో సెల్‌ఫోన్, ఇతర ఎలక్ట్రానిక్ పరికరాలు ఆలయంలోకి తేకుండా నిరోధించేందుకు వీలుంటుంది. రామాలయంలో భద్రతా చర్యలు మరింత కట్టుదిట్టం చేసే క్రమంలో భాగంగా నూతన పరికరాలు కొనుగోలు చేసినట్టు దేవస్థానం అధికారులు పేర్కొన్నారు.

సమ్మేళనానికి తరలిన శ్రేణులు

ఖర్గే సభతో కాంగ్రెస్ కేడర్‌లో నూతనోత్సాహం



ఖమ్మం నుంచి ఖర్గే సభకు తరలిన కాంగ్రెస్ శ్రేణులు

ఖమ్మం, జూలై 4 (ఆంధ్రజ్యోతిప్రతినిధి): హైదరాబాద్‌లో శుక్రవారం జరిగిన కాంగ్రెస్ ముఖ్య నాయకులు, కార్యకర్తల సమ్మేళనానికి ఉమ్మడి ఖమ్మం జిల్లా నుంచి శ్రేణులు తరలివెళ్లాయి. స్థానికసంస్థల ఎన్నికలే లక్ష్యంగా కార్యకర్తలు, నాయకులను సమాయత్తం చేసేందుకు ఏఐసీసీ అధ్యక్షుడు మల్లిఖార్జున ఖర్గే నేతృత్వంలో శుక్రవారం హైదరాబాద్ ఎల్బీస్టేడియంలో నిర్వహించిన సభతో కేడర్‌లో కొత్త ఉత్సాహం కనిపించింది. ఈ సభకు గ్రామ, మండల, జిల్లా కమిటీ నాయకులు, కార్యకర్తలు, అనుబంధ సంఘాల ప్రతినిధులు, ఖమ్మం కార్పొరేషన్ పరిధిలోని కార్పొరేటర్లు తరలివెళ్లారు. నాయకులు, కార్యకర్తలు తరలివెళ్లేందుకు గాను కాంగ్రెస్ నాయకత్వం ప్రత్యేక బస్సులను కూడా ఏర్పాటు చేసింది. మండలాల వారీగా ఈ బస్సుల్లో కార్యకర్తలను ఎక్కించుకుని ఖర్గే నిర్వహించిన సభకు తరలివెళ్లారు. జిల్లాకు చెందిన ఉపముఖ్యమంత్రి భట్టి విక్రమార్క, మంత్రులు తుమ్మల నాగేశ్వరరావు, పొంగులేటి శ్రీనివాసరెడ్డితోపాటు ఎమ్మెల్యేలు మాలోతు రాందాస్‌నాయక్, మట్టా రాగమయి, కోరం కనకయ్య, జారే ఆదినారాయణ, తెల్లం వెంకటరావు, పాయం వెంకటేశ్వర్లు జన సమీకరణ చేశారు. కార్పొరేషన్ ఛైర్మన్లు, పీసీసీ నియమించిన నియోజకవర్గ ఇన్‌చార్జ్‌లు, నగర కాంగ్రెస్ అధ్యక్షులు కాంగ్రెస్ జెండాలు చేతబట్టి సభకు తరలారు. రాబోయే స్థానిక సంస్థల ఎన్నికల్లో పార్టీ విజయం కోసం గ్రామస్థాయి కార్యకర్తలను సమాయత్తం చేసేందుకు రాష్ట్ర ప్రభుత్వం అమలు చేస్తున్న అభివృద్ధి, సంక్షేమ కార్యక్రమాలను ప్రజల్లోకి తీసుకెళ్లేందుకు కాంగ్రెస్ ప్రతినిధులతో రాష్ట్ర వ్యాప్తంగా నిర్వహించిన సభతో కార్యకర్తల్లో నూతనోత్సాహం నెలకొంది.

ఐదు రోజులుగా మృత్యువుతో పోరాడి..

- చికిత్స పొందుతూ బాలుడి మృతి
- కూల్‌డ్రింక్ అనుకుని గడ్డిమందు తాగడంతో ఘటన
- కరకగూడెం మండలం చొప్పాలలో విషాదం



మృతిచెందిన వరుణ్‌తేజ్

కరకగూడెం, జూలై 4 (ఆంధ్రజ్యోతి) : కూల్‌డ్రింక్ అనుకుని గడ్డి మందు తాగిన కరకగూడెం మండలం చొప్పాల పంచాయతీ చొప్పాల గ్రామానికి చెందిన జాడి వరుణ్ తేజ్(5) ఐదు రోజుల పాటు మృత్యువుతో పోరాడి కన్నుమూశాడు. ఈ ఘటనకు సంబంధించిన వివరాలివీ.. చొప్పాల గ్రామానికి చెందిన జాడి నవీన్, వరలక్ష్మి దంపతుల చిన్నకుమారుడైన వరుణ్‌తేజ్ తన తండ్రి నవీన్ ఓ రైతుకు అవసరమైన గడ్డి మందును ఒక కూల్‌డ్రింక్ బాటిల్‌లో తెచ్చి ఇంట్లో పెట్టాడు. ఈ క్రమంలో గత నెల 30న ఇంట్లో ఆడుకుంటున్న వరుణ్‌తేజ్ ఆబాటిల్‌ను చూసి కూల్‌డ్రింక్‌గా భావించి తాగాడు. కొంత సమయం తరువాత వరుణ్ తేజ్ నోటి నుంచి నురుగులు, కడుపు నొప్పి రావడంతో కుటుంబ సభ్యులు కరకగూడెం, మణుగూరు. భద్రాచలం, కొత్తగూడెం, ఖమ్మం వైద్యశాలలకు తరలించారు. అక్కడ వరుణ్ తేజ్ పరిస్థితి విషమంగా ఉండటంతో హైదరాబాద్‌లోని నిలోఫర్ ఆస్పత్రిలో చేర్పించారు. అక్కడ చికిత్స పొందుతూ శుక్రవారం మృతి చెందాడని కుటుంబ సభ్యులు తెలిపారు. వరుణ్ తేజ్ మృతితో కుటుంబ సభ్యులు కన్నీరు మున్నీరుగా విలపిస్తున్నారు. గ్రామంలో విషాదఛాయలు అలముకున్నాయి.

కన్నోళ్లకు కన్నీరు మిగిలె..



అన్నదమ్ములు నాగగోపి, నందకిశోర్ మృతదేహాలు

- మున్నేటిలో మునిగి అన్నదమ్ముల మృతి
- స్నానం చేసేందుకు దిగిన క్రమంలో ప్రమాదం
- ఇసుక తవ్వకంతో ఏర్పడిన గుంతే కారణం
- చింతకాని మండలం చిన్నమండవలో విషాదం
- మిన్నంటిన తల్లిదండ్రులు, కుటుంబసభ్యుల రోదనలు

చింతకాని, జూలై 4 (ఆంధ్రజ్యోతి) : విధి ఆ కుటుంబంపై పగబట్టింది. ఆ దంపతులకు కడుపు కోత.. కన్నీటిని మిగిల్చింది. చేతికందివస్తున్న ఇద్దరు కుమారులను మున్నేరు బలితీసుకుంది. ద్విచక్రవాహనాలను శుభ్రం చేసేందుకని మిత్రులతో కలిసి మున్నేటి వద్దకు వెళ్లిన ఆ అన్నదమ్ములు.. స్నానానికని లోపలికి దిగి.. నోరు తెరుచుకున్న మృత్యువులా ఉన్న గుంతలో గల్లంతై మృతిచెందారు. ఈ విషాదకర సంఘటన చింతకాని మండలం చిన్నమండవ గ్రామంలో శుక్రవారం జరిగింది. గ్రామస్థులు తెలిపిన వివరాల ప్రకారం... చిన్నమండవ గ్రామానికి చెందిన కాశిమాల వెంకటి, సుభద్ర దంపతులకు ఇద్దరు కుమారులు. పెద్ద కుమారుడు నాగగోపి (22) హైదరాబాద్‌లో ఇంజనీరింగ్ పూర్తి చేశాడు. చిన్న కుమారుడు నందకిశోర్ (18) నందకిశోర్ నాగులవంచ ప్రభుత్వ జూనియర్ కళాశాలలో ఇంటర్ పూర్తి చేసి ఈ నెల 8వ తేదీన ఇంజనీరింగ్ కౌన్సెలింగ్‌కు హాజరు కావాల్సి ఉంది. వీరు శుక్రవారం గ్రామానికి చెందిన మరో ఇద్దరు మిత్రులు గంటెల ప్రవీణ్, మోచర్ల రాజ్‌కుమార్‌తో కలిసి మూడు ద్విచక్ర వాహనాలను శుభ్రం చేసేందుకని గ్రామ సమీపంలోని మున్నేటి వద్దకు వెళ్లారు. ద్విచక్ర (మిగతా 6వ పేజీలో)

గోదావరికి కొత్త నీరు

- భద్రాద్రి వద్ద ఎరుపు రంగు నురగలతో కళకళ
- ఈ సీజన్‌లో తొలిసారి 17 అడుగులు దాటిన ప్రవాహం



కొత్త నీటితో కళకళలాడుతున్న గోదావరి

భద్రాచలం, జూలై 4(ఆంధ్రజ్యోతి) : గోదావరి ఉపనది అయిన ఇంద్రావతి నది పరివాహక ప్రాంతంలో ఇటీవల కురిసిన వర్షాలతో భద్రాచలం వద్ద గోదావరికి కొత్త నీరు చేరింది. దీంతో ఎరుపు రంగు నురగలతో పరవళ్లుతొక్కుతోంది. ఇటీవల వరకు భద్రాచలం వద్ద ఐదు అడుగులు మాత్రమే ఉన్న నీటి మట్టం కొత్తనీటి రాకతో స్వల్పంగా పెరుగుతుండగా.. మూడు రోజుల క్రితం స్థానికంగా పడిన వర్షాలకు 14అడుగులకు చేరి.. తిరిగి 10అడుగులకు తగ్గింది. మళ్లీ గత 24గంటలుగా గోదావరి నీటిమట్టం క్రమేపీ పెరుగుతూ వచ్చి శుక్రవారం సాయంత్రం 17అడుగులు దాటి ప్రవహిస్తోంది. ఈ పెరుగుదల మరో మూడు అడుగుల లోపు ఉండవచ్చని కేంద్ర జలసంఘం ఆదికారులు అంచనా వేస్తున్నారు. చాలారోజుల భద్రాచలం స్నానఘట్టాల జలకళ సంతరించుకుంది. గోదావరి నెమ్మదిగా పెరుగుతుండడంతో స్నానఘట్టాల వద్ద ఉన్న చిరువ్యాపారులు తమ దుకాణాలను సురక్షిత ప్రాంతాలకు తరలించారు. శుక్రవారం భద్రాచలం కరకట్టపై నుంచి వరద ప్రవాహన్ని ఐటీడీఏ పీవో బి.రాహుల్ పరిశీలించారు. ఈ క్రమంలో ఆయన వెంట ఉన్న నీటిపారుదల శాఖ, భద్రాచలం గ్రామపంచాయతీ అధికారులకు పలు సూచనలు చేశారు.

బాధ్యతల బరువు.. తప్పని అరువు

- రెండేళ్లుగా పంచాయతీలకు నిలిచిన కేంద్ర, రాష్ట్ర నిధులు
- ఆర్థిక ఇబ్బందులతో సతమతమవుతున్న కార్యదర్శులు
- పనుల నిర్వహణకు సొంత నిధులతో పాటు అప్పులు
- ట్రాక్టర్ల ఈఎంఐ చెల్లింపుల్లో జాప్యంతో వ్యక్తిగత సిబిల్ స్కోర్‌పై ప్రభావం
- పారిశుధ్య నిర్వహణకూ పైసలు కరువు

దుమ్ముగూడెం, జూలై 4 (ఆంధ్రజ్యోతి) : కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల నుంచి గ్రామ పంచాయతీలకు నిధులు నిలిచిపోవడంతో పంచాయతీ కార్యదర్శుల పరిస్థితి అగమ్య గోచరంగా మారింది. పంచాయతీలకు పాలకవర్గాలు లేకపోవడంతో ప్రస్తుతం ప్రత్యేక అధికారుల పాలన సాగుతుండగా గ్రామాల్లోని సమస్యల పరిష్కార బాధ్యత కార్యదర్శులపై పడింది. ఈ నేపథ్యంలో తమను నమ్ముకున్న కుటుంబాన్ని పోషించుకోవాలా లేక బతుకు దెరువైన ఉద్యోగాన్ని నిలబెట్టుకోవాలో తెలియని స్థితిలో పంచాయతీ కార్యదర్శులు సతమతమవుతున్నారు. ఒకపక్క పంచాయతీల్లో నెలకొన్న సమస్యలను పరిష్కరించాలని ఉన్నతాధికారులు ఆదేశిస్తుండగా మరోవైపు నిధుల కొరతతో కార్యదర్శుల నెత్తిపై మోయలేని ఆర్థిక భారం పడుతోంది. రెండేళ్లుగా కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల నుంచి పంచాయతీలకు నిధులు విడుదలవకపోవడంతో గ్రామాల్లో కనీస సదుపాయాల కల్పనకు విఘాతం కలుగుతోంది. వానాకాలం సీజన్ ప్రారంభమవడంతో ప్రస్తుతం పారిశుధ్య పనుల నిర్వహణకు కూడా నిధుల్లేకపోవడంతో కార్యదర్శులు ఏం చేయాలో తెలియని దిక్కుతోచని స్థితిలో కొట్టుమిట్టాడుతున్నారు. మరో పక్క మూడు నెలలుగా వేతనాలు అందకపోవడంతో పంచాయతీలోని మల్టీ పర్పస్ వర్కర్లు సైతం తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు.



రెండేళ్లుగా ఒక్క రూపాయి రాలేదు..

గ్రామ పంచాయతీలకు రావాల్సిన 15వ ఫైనాన్స్ కమిషన్, (మిగతా 6వ పేజీలో)



అమృత్ సదస్సులో మాట్లాడుతున్న మేయర్ పునుకొల్లు నీరజ

రాజకీయాలకతీతంగా నిధులివ్వాలి

- 'అమృత్' జాతీయ సదస్సులో ఖమ్మం మేయర్
- జిల్లా ప్రజా ప్రతినిధికి అరుదైన అవకాశం

6

వరదలను ఎదుర్కొనేందుకు సిద్ధం

- నష్టాన్ని తగ్గించడమే లక్ష్యంగా పనిచేయాలి
- ఉధృతిని సమర్థవంతంగా అంచనా వేయాలి
- జిల్లా విపత్తుల నిర్వహణ అథారిటీ సమావేశంలో కలెక్టర్ అనుదీప్

6

సమ్మిళిత అభివృద్ధికి సహకార నమూనా

- ఖమ్మం డీసీసీబీ పరిధిలో 100 సంఘాలు



నేడు అంతర్జాతీయ సహకార దినోత్సవం

ఖమ్మం వ్యవసాయం, జూలై 4(ఆంధ్రజ్యోతి): 'సహకార సంస్థలు మెరుగైన ప్రపంచాన్ని నిర్మిస్తాయి' అనేది 2025 అంతర్జాతీయ సహకార సంఘ దినోత్సవ నినాదం. ఈ నినాదం సహకార సంస్థలు సామాజిక, ఆర్థిక పర్యావరణ సమస్యలను పరిష్కరించడంలో ముఖ్యమైన పాత్ర పోషిస్తాయని తెలియజేస్తుంది. ప్రతీఏడాది జూలై మొదటి శనివారం సహకార దినోత్సవం జరుపుకోవటం ఆనవాయితీ. ఈ క్రమంలోనే శనివారం సహకార దినోత్సవాన్ని సంబురంగా.. సరికొత్త ఆశలతో సహకార స్ఫూర్తిని మరోసారి చాటడానికి సమాయత్తమయ్యారు.

నాలుగేళ్ల క్రితం అనేక సంస్కరణలు..

ఖమ్మం కేంద్ర సహకార బ్యాంకు పరిధిలో మొత్తం 100 సంఘాలున్నాయి. ఈ సంఘాలు ఖమ్మం, భద్రాద్రి, ములుగు, మహబూబాబాద్ జిల్లాల్లో విస్తరించి ఉన్నాయి. నాలుగేళ్ల క్రితం కేంద్ర ప్రభుత్వం ప్రత్యేక సహకార శాఖను ఏర్పాటు చేసి అనేక సంస్కరణలు చేపట్టిన తర్వాత మన దేశంలో సహకార వ్యవస్థలో కొత్త కదలిక మొదలైంది. అనాదిగా రైతులకు రుణాలు ఇచ్చే సొసైటీలుగా ఉన్న ప్రాథమిక వ్యవసాయ పరపతి సహకార సంఘాలు (పీఏసీఎస్‌లు) రైతుల ఆర్థికసేవలకే పరిమితం కాకుండా ఇతర ప్రజల అవసరాలను కూడా తీర్చే వ్యాపార సంస్థగా ఉండాలని భావించి కేంద్ర సహకార శాఖ పీఏసీఎస్‌లకు సరికొత్త బైలాస్‌ను నిర్దేశించటం ఒక కీలక పరిణామం. ఈ సేవలన్నీ పారదర్శకంగా అందించటం కోసం పీఏసీఎస్ అన్నింటినీ కంప్యూటరీకరించే పని జరుగుతోంది.

కొత్తపుంతలు తొక్కించే లక్ష్యంతో కేంద్రం

సహకార వ్యవస్థతో గట్టి సంబంధం ఉన్న కేంద్ర మంత్రి అమిత్ షా సహకార సంఘాల అభివృద్ధిపై దృష్టిసారించారు. సహకార వ్యాపారాన్ని దేశ విదేశాల్లో కొత్త పుంతలు తొక్కించాలన్నది తమ లక్ష్యమని కేంద్ర ప్రభుత్వం స్పష్టం చేస్తోంది. సాచివేత ధోరణి, అవినీతి, మితిమీరిన రాజకీయ జోక్యం, జవాబుదారీతనం లోపించటం లాంటి జాడ్యాలతో కునారిల్లుతున్న సహకార శాఖల్లో కొత్తగా సహకార స్ఫూర్తి వెల్లివిరియాలంటే సంస్కరణలు తేవాలని నిపుణులు అభిప్రాయపడుతున్నారు. అప్పుడే 'సహకార నమూనా' మేలైన సమ్మిళిత అభివృద్ధి మార్గంగా నిలుస్తోంది. వాతావరణ మార్పుల గడ్డు కాలంలో సహకార అభివృద్ధి నమూనా కొత్త ఆశలను రేకెత్తిస్తోంది.

వరదలను ఎదుర్కొనేందుకు సిద్ధం

- నష్టాన్ని తగ్గించడమే లక్ష్యంగా పనిచేయాలి
- ఉధృతిని సమర్థవంతంగా అంచనా వేయాలి
- జిల్లా విపత్తుల నిర్వహణ అథారిటీ సమావేశంలో కలెక్టర్ అనుదీప్



డిజాస్టర్ సర్వైవర్ గైడ్‌ను ఆవిష్కరిస్తున్న కలెక్టర్

ఖమ్మం కలెక్టరేట్, జూలై 4 (ఆంధ్రజ్యోతి): వరదలను ఎదుర్కొనేందుకు సిద్ధంగా ఉన్నామని, వరద నష్టాన్ని తగ్గించాలన్న లక్ష్యంతో సమష్టిగా కృషి చేయాలని ఖమ్మం కలెక్టర్ అనుదీప్ దురిశెట్టి జిల్లా అధికార యంత్రాంగాన్ని ఆదేశించారు. శుక్రవారం కలెక్టరేట్ సమావేశ మందిరంలో స్థానిక సంస్థల అదనపు కలెక్టర్ డాక్టర్ పి.శ్రీజ, ఎన్‌డీఎంఏ జాయింట్ అడ్వయిజర్ నావల్ ప్రకాష్, అడ్మినిస్ట్రేషన్ అండర్ సెక్రటరీ అభిషేక్ బిశ్వాస్, డీఎం కన్సల్టెంట్ డాక్టర్ వజీం ఇక్బాల్, తెలంగాణ రాష్ట్ర డిజాస్టర్ మేనేజ్‌మెంట్ అథారిటీ కన్సల్టెంట్ గౌతం కృష్ణ తేజ, బి.అనుపమ, టీజే సంద్ర, సంబంధిత అధికారులతో కలిసి జిల్లా విపత్తుల నిర్వహణ అథారిటీ సమావేశాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన గతేడాది వచ్చిన భారీ వరదలు, విపత్తుల నిర్వహణ కోసం జిల్లాలో చేసిన ఏర్పాట్లు, ప్రణాళిక తదితర అంశాలను పవర్ పాయింట్ ప్రజంటేషన్ ద్వారా వివరించారు. విపత్తుల సమయంలో రెవెన్యూ, నీటి పారుదల, మునిసిపల్, పంచాయతీరాజ్, వైద్య ఆరోగ్య, పశుసంవర్థక శాఖ వారి పరిధిలో చేపట్టిన పనుల గురించి వివరించారు. అనంతరం కలెక్టర్ మాట్లాడుతూ గతేడాది ఖమ్మం నగర చరిత్రలో ఎన్నడూ లేని విధంగా వరదలు వచ్చాయని, మున్నేరు నదీ పరివాహక ప్రాంతాలు ముంపునకు గురయ్యాయని, తిరుమలాయపాలెం మండలంలో రాకాసి తండా, అజ్మీరా తండాలో 150మందిని ఎన్‌డీఆర్‌ఎఫ్ బృందాలు సంరక్షించాల్సి వచ్చిందన్నారు. గతేడాది వరదల్లో ఆరుగురు చని పోయారని తెలిపారు. ప్రభుత్వం బాధితులకు పరిహారం అందించిందన్నారు. ఈ ఏడాది విపత్తు నిర్వహణపై దృష్టి పెట్టామని, నీటి వనరులు, వాతావరణ పరిస్థితులను ఎప్పటికప్పుడు అధ్యయనం చేస్తున్నామని, వరద ఉధృతి అంచనాలను సమర్థవంతంగా తెలుసుకుంటూ, విపత్కర పరిస్థితుల్లో ముంపు, లోతట్టు ప్రాంతాల్లోని ప్రజలను సురక్షిత ప్రాంతాలకు వేగవంతంగా తరలించేందుకు అధికారులు, ఆపద మిత్ర వలంటీర్లను సన్నద్ధం చేశామన్నారు. ఖమ్మం మునిసిపల్ కార్పొరేషన్ పరిధిలో 300మందికిపైగా ఆపద మిత్రలకు, స్థానిక కార్పొరేటర్లు, ప్రజా ప్రతినిధులకు విపత్తుల నిర్వహణపై అవగాహన కల్పించామన్నారు. జిల్లాతోపాటు ఎగువన ఉన్న వరంగల్, మహబూబాబాద్ జిల్లాలో వరద పరిస్థితులు, మున్నేరు నది ప్రవాహం నిరంతరం పర్యవేక్షించాలన్నారు. వరదల సమయంలో ప్రజలు సెల్ఫీ కోసం బయటకు రాకుండా అవగాహన కల్పిస్తున్నామని, విపత్తుల సమయంలో సాధారణంగా కనిపించే పరిస్థితులు నిమిషాల వ్యవధిలోనే మారిపోతాయన్నారు.

ఎన్‌డీఎంఏ జాయింట్ అడ్వైజర్ నావల్ ప్రకాష్ మాట్లాడుతూ నీటి వనరులు, చెరువులు, చెక్ డ్యాంల వద్ద అవసరమైన చోట పూడికతీత పనులు చేపట్టాలన్నారు. పిడుగులు పడినప్పుడు రైతులు చెట్ల కింద ఉండి మరణించకుండా వ్యవసాయ విస్తరణ అధికారుల ద్వారా అవగాహన కల్పించాలన్నారు. జూన్ 16న కేంద్ర హోం శాఖ మంత్రి ఆధ్వర్యంలో నిర్వహించిన సమావేశంలో సూచించిన మేరకు జిల్లా స్థాయిలో విపత్తుల నిర్వహణ ప్రణాళిక తయారు చేసుకోవాలన్నారు. జిల్లాలో అన్ని రకాల ప్రమాదాలకు ఒకే వేదిక నుంచి సమాచారం అందించేలా చూడాలని అన్నారు. ఖమ్మం మునిసిపల్ కమిషనర్ అభిషేక్ అగస్త్య మాట్లాడుతూ నగరంలో మురికి కాల్వల, నాలాలను పూర్తిస్థాయిలో పూడిక తీశామన్నారు. ప్రకాష్‌నగర్ చెక్ డ్యాం ఎత్తు తగ్గింపునకు చర్యలు తీసుకుంటున్నామన్నారు. స్థానిక సంస్థల అదనపు కలెక్టర్ డాక్టర్ పి.శ్రీజ మాట్లాడుతూ వరదల సమయంలో అంటువ్యాధులు ప్రబలకుండా పటిష్ఠ చర్యలు చేపట్టేందుకు అవసరమైన కార్యాచరణ రూపొందించుకున్నామన్నారు. ఈ సందర్భంగా కలెక్టర్ డిజాస్టర్ సర్వైవర్ గైడ్‌ను ఆవిష్కరించారు. ఈ సమావేశంలో జిల్లా రెవెన్యూ అధికారి పద్మశ్రీ, జడ్పీ సీఈవో దీక్షా రైనా, డీఆర్డీవో సన్యాసయ్య, సీపీవో శ్రీనివాస్, జిల్లా వ్యవసాయశాఖ అధికారి పుల్లయ్య, జిల్లా వైద్య, ఆరోగ్య శాఖ అధికారి డాక్టర్ కళావతి బాయి, నీటిపారుదలశాఖ ఎస్ఈ మంగళపూడి వెంకటేశ్వర్లు, జిల్లా విద్యాశాఖ అధికారి ఎస్.సత్యనారాయణ, వివిధ శాఖల జిల్లా అధికారులు, తహసీల్దార్లు, ఎంపీడీవోలు, ఆపదమిత్రలు పాల్గొన్నారు.

మత్తు వైద్యుడి పోస్టు భర్తీకి దరఖాస్తు ఆహ్వానం

- కాంట్రాక్ట్ పద్ధతిలో నియామకం
- డీసీహెచ్‌ఎస్ రవిబాబు నాయక్

చుంచుపల్లి, జూలై 4 (ఆంధ్రజ్యోతి): కాంట్రాక్ట్ పద్ధతిన అశ్వారావుపేటలో ఒక మత్తు వైద్య నిపుణుడి పోస్ట్ భర్తీకి దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్టు డీసీహెచ్‌ఎస్ రవిబాబునాయక్ శుక్రవారం ఓ ప్రకటనలో తెలిపారు. ఆసక్తిగల అభ్యర్థులు ఈ నెల 10వ తేదీ సాయంత్రం ఐదు గంటలలోపు ఐడీవోసీలోని సూపరింటెండెంట్, జిల్లా ఆస్పత్రి ప్రధాన కార్యాలయం, ఎస్-26 నందు అందజేయాలని కోరారు. ఈ పోస్టుకు నెల వారి వేతనం రూ.1.50 లక్షలుగా నిర్ణయించినట్టు తెలిపారు. పూర్తి వివరాలకు అధికారిక భద్రాద్రి జిల్లా వెబ్‌సైట్‌ను పరిశీలించాలని కోరారు.

ఆదివాసీల అభివృద్ధికి పోలీసు శాఖ కృషి

- భద్రాద్రి ఎస్పీ రోహిత్‌రాజు
- గొత్తికోయ గ్రామంలో కమ్యూనిటీ కనెక్ట్ ప్రోగ్రాంకు హాజరు

కొత్తగూడెం, జూలై 4 (ఆంధ్రజ్యోతి): లక్ష్మీదేవిపల్లి మండలంలోని గంగమ్మకాలనీ గొత్తికోయ గ్రామాల్లో లక్ష్మీదేవిపల్లి పోలీసుల ఆధ్వర్యంలో శుక్రవారం ఏర్పాటు చేసిన కమ్యూనిటీ కనెక్ట్ కార్యక్రమంలో పాల్గొన్నారు. ఎస్పీ రోహిత్‌రాజ్ మాట్లాడుతూ జిల్లాలోని ఆదివాసీల సంక్షేమం, అభివృద్ధి కోసం పోలీసుశాఖ తరపున ఎల్లప్పుడు ముందుంటామన్నారు. ఆదివాసీ ప్రజలకు కనీస సౌకర్యాలను అందించడంలో లక్ష్యంగా పోలీస్‌శాఖ పని చేస్తుందని తెలిపారు. ఏజెన్సీ ప్రాంతాల్లోని యువత, పిల్లలు విద్య ద్వానే ఉన్నత స్థానాలకు చేరుకుంటారని తెలిపారు. గ్రామంలోకి ఎవరైనా కొత్త వ్యక్తులు ప్రవేశిస్తే వెంటనే పోలీసులకు సమాచారం అందించాలని కోరారు. వర్షాకాలంలో తమ ఇళ్లచుట్టు పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలని, అధికంగా మురుగునీరు చేరడం వల్ల దోమలు అధికమై డెంగ్యూ, మలేరియా, టైఫాయిడ్ వంటి విషపూరిత జ్వరాల బారిన పడే అవకాశం ఉందని అధికారులు సూచించారు. అనంతరం ఎస్పీ చేతుల మీదుగా అక్కడ నివసించే 27 కుటుంబాల వారికి దుప్పట్లు, దోమ తెరలను పంపిణీ చేశారు. విద్యుత్, మొబైల్ నెట్‌వర్క్ సమస్యలను సంబంధిత అధికారులతో మాట్లాడి త్వరలోనే పరిష్కరిస్తామని తెలిపారు. అనంతరం మద్దె గుంపునకు చేరుకుని అక్కడ నివసిస్తున్న ఆదివాసీ ప్రజల ప్రస్తుత స్థితి గతులను అడిగి తెలుసుకున్నారు. ఈ కార్యక్రమంలో అడిషనల్ ఎస్పీ ఆపరేషన్స్ జి.నరేందర్, కొత్తగూడెం డీఎస్పీ రెహమాన్, ఎస్పీ ఇన్‌స్పెక్టర్ శ్రీనివాస్, చుంచుపల్లి సీఐ వెంకటేశ్వర్లు, లక్ష్మీదేవిపల్లి ఎస్ఐ రమణా రెడ్డి, ఎస్ఐ కార్తీక్, లక్ష్మీదేవిపల్లి పోలీసు సిబ్బంది, స్పెషల్ పార్టీ సిబ్బంది పాల్గొన్నారు.



నిత్యావసరాలను పంపిణీ చేస్తున్న భద్రాద్రి ఎస్పీ రోహిత్‌రాజు

యూరియా కొరత లేదు..

భద్రాద్రి జిల్లా వ్యవసాయ అధికారి బాబురావు

ఇల్లెందు టౌన్, జూలై 4 (ఆంధ్రజ్యోతి): వ్యవసాయ సీజన్‌లో ఈ సంవత్సరం ఎరువుల కొరత లేదని, ఎరువులన్నీ అందుబాటులోనే ఉన్నాయని జిల్లా వ్యవసాయ అధికారి వేల్పుల బాబురావు తెలిపారు. శుక్రవారం ఇల్లెందులో ఎరువుల దుకాణాలను తనిఖీ చేశారు. వ్యవసాయ సహకార శాఖ ఆధ్వర్యంలో ఉన్న ఎరువుల గోడౌన్‌ను పరిశీలించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ ఎరువుల కోసం రైతులు ఎలాంటి వ్యయప్రయాసాలు లేకుండానే అందుబాటులోనే ఉంచామని వెల్లడించారు. 1100 మెట్రిక్ టన్నుల ఎరువులు ఉన్నాయని, జిల్లాలో ఎలాంటి కొరత లేదన్నారు. పోడు సాగు అధికంగా ఉన్న ప్రాంతాల్లో సైతం ఎరువులను అందుబాటులో ఉంచామని పేర్కొన్నారు. ఇప్పటి వరకు 2.5 లక్షల ఎకరాల్లో విత్తనాలు వేశారని 60వేల ఎకరాల్లో మొక్కజొన్న వేశారని తెలిపారు. యూరియా కోసం రైతులు క్యూలైన్‌లో ఉండాల్సిన అవసరం లేదన్నారు. యూరియా ఇప్పుడే ఏ పంటకు వేయాల్సిన అవసరం లేదని ఈ విషయాన్ని రైతులు గుర్తించాలని సూచించారు. ఎరువులు ఇంకా 10వేల మెట్రిక్ టన్నులు అందుబాటులో రానున్నాయని పేర్కొన్నారు. జిల్లా మంత్రి తుమ్మల నాగేశ్వరరావు ఎప్పటికప్పుడు వ్యవసాయ అధికారులతో సమీక్షలు జరుపుతూ ఎరువుల కొరత లేకుండా తగిన చర్యలు తీసుకుంటున్నారని తెలిపారు. ఆయన వెంట ఇల్లెందు వ్యవసాయ అధికారులు లాల్‌చంద్, సతీష్, వ్యవసాయ పరపతి సంఘం కార్యదర్శి హీరాలాల్ తదితరులు ఉన్నారు.

ఆయకట్టులో ఆశలు

(5వ పేజీ తరువాయి)

521.4 అడుగులమేర నీరు నిల్వ ఉంది. 312 టీఎంసీలకు గాను, 151.82 టీఎంసీల నీరు నిల్వ ఉంది. ప్రస్తుతం కృష్ణానదీ పరివాహక ప్రాంతాల్లో వర్షాలు కొద్దిగా తగ్గడంతో నీటిప్రవాహాలు తగ్గినట్టు అధికారులు తెలిపారు.

2.50లక్షల ఎకరాల్లో సాగుకు అవకాశం

కృష్ణా పరివాహక ప్రాంతంలో కురుస్తున్న వర్షాలతో ఆయకట్టులో అన్నదాతల్లో ఆశలు చిగురిస్తున్నాయి. సాగర్ నిండితే ఈఏడాది నల్లగొండ, సూర్యాపేట, ఖమ్మం జిల్లాల్లో 1, 2, 3 జోన్ల పరిధిలో సాగుకు నీరు విడుదల చేసే అవకాశం ఉంది. గతేడాది కూడా సాగర్ ఆయకట్టుకు ఆగస్టు మొదటివారంలో నీరు విడుదల చేయగా ఈ సారి కూడా మొదటివారంలోనే నీటిని విడదల చేసే అవకాశాలు కనిపిస్తున్నాయి. ఈ ఏడాది వరుణదేవుడు కరుణించడంతో ఆశలు రేకెత్తుతున్నాయి. ఖమ్మంజిల్లా రెండోజోన్ పరిధిలో 2.50 లక్షల ఎకరాలు సాగయ్యే అవకాశం ఉంది.

కన్నోళ్లకు కన్నీరు మిగిలె..

(5వ పేజీ తరువాయి)

వాహనాలను శుభ్రం చేసిన అనంతరం వాహనాలను ఒడ్డుకు పెట్టి స్నానం చేసేందుకు మళ్లీ మున్నేటిలోకి దిగారు. కానీ ఆ నలుగురికి ఈత రాకపోవడం, నీటి లోతు అంచనా వేయలేక నీటి మునిగిపోయారు. ఆ సమయంలో వారు కేకలు వేయగా.. సమీపంలో చేపలు పడుతున్న గ్రామానికి చెందిన పట్టా బుజ్జిబాబు అనే వ్యక్తి గమనించి వారిని కాపాడేందుకు ప్రయత్నించాడు. ప్రవీణ్, రాజ్‌కుమార్‌ను బయటకు లాగగా.. నాగగోపి, నందకిషోర్ అప్పటికే మరింత లోతుకు మునిగి గల్లంతయ్యారు. విషయం తెలుసుకున్న గ్రామస్థులు మున్నేటి వద్దకు చేరుకుని నాగగోపి, నందకిశోర్‌ల కోసం మూడు గంటల పాటు గాలించినా వారి ఆచూకీ లభ్యం కాకపోవడంతో పోలీసులు ఖమ్మంలోని ఎన్‌డీఆర్‌ఎఫ్ బృందాలకు సమాచారం ఇచ్చారు. చీకటి పడుతుండటంతో గ్రామానికి చెందిన కొంత మంది యువత సాహసించి మరింత లోతుకు వెళ్లి వెతకడంతో మృతదేహాలు లభ్యమయ్యాయి. తహసీల్దార్ కరుణాకర్ రెడ్డి, ఎస్ఐ నాగుల్‌మీరా నాలుగు గంటల పాటు ఘటన జరిగిన ప్రాంతంలో ఉండి గాలింపు చర్యలను పర్యవేక్షించారు. చేతికొచ్చిన కుమారులిద్దరూ ఒకే సారి మృతి చెందడంతో ఆ తల్లితండ్రులు గుండెలవిసేలా రోదిస్తున్నారు. గ్రామస్థులు తీవ్ర విషాదంలో మునిగిపోయారు. యువకుల మృతదేహాలను చూసి పలువురు కన్నీరు పెట్టుకున్నారు. ఇదిలా ఉండగా ఇసుక కోసం తవ్విన గుంతలే లే అన్నదమ్ముల మృతికి కారణమంటూ గ్రామస్థులు ఆరోపిస్తున్నారు.



నాగగోపి, నందకిశోర్ (ఫైల్)

రాజకీయాలకతీతంగా నిధులివ్వాలి

- 'అమృత్' జాతీయ సదస్సులో ఖమ్మం మేయర్
- జిల్లా ప్రజాప్రతినిధికి దక్కిన అరుదైన అవకాశం

ఖమ్మం కార్పొరేషన్, జూలై 4 (ఆంధ్రజ్యోతి) : రాజకీయాలకతీతంగా తెలంగాణ రాష్ట్రంలోని నగరాలకు నిధులు కేటాయించాలని ఖమ్మం నగర పాలక సంస్థ మేయర్ పునుకొల్లు నీరజ కేంద్రాన్ని కోరారు. ఢిల్లీలో రెండు రోజుల పాటు జరిగిన అమృత్ నగరాల జాతీయ సదస్సుకు హాజరైన ఆమె శుక్రవారం జరిగిన ముగింపు సదస్సులో మాట్లాడారు. బీజేపీ పాలిత రాష్ట్రాల్లోని నగరాలకు అధిక నిధులు కేటాయింపు జరుగుతోందని, తెలంగాణ రాష్ట్రంలోని నగరాలకు నిధులివ్వటం లేదని పేర్కొన్నారు. అలాగే రైల్వే లైన్ల నిర్మాణం కారణంగా నిరాశ్రయులైన వారి కుటుంబాలను కేంద్ర ప్రభుత్వం ఆదుకోవాలని, ప్రత్యేకంగా నివాసాలు, మౌలిక సౌకర్యాలు కల్పించే బాధ్యత తీసుకోవాలని కోరారు. అమృత్ పథకం ద్వారా ఖమ్మం నగరంలో చేపట్టిన అండర్ గ్రౌండ్ డ్రెయినేజీ, ఇతర నిర్మాణ పనుల గురించి మేయర్ వివరించారు. ఈ సదస్సులో మేయర్‌తో పాటు డిప్యూటీ మేయర్ ఫాతిమా జోహారా కూడా పాల్గొన్నారు.

బాధ్యతల బరువు.. తప్పని అరువు

(5వ పేజీ తరువాయి)

స్టేట్ ఫైనాన్స్ కమిషన్ నిధులు సుమారు రెండేళ్లుగా రావడం లేదు. దీంతో వీధి దీపాలు, బ్లీచింగ్, డీజిల్, పైపులైన్ మరమతులు, పారిశుధ్యం పనులకు అప్పులు చేయాల్సిన పరిస్థితి నెలకొంది. మిగతా అవసరాలను పక్కనపెడితే కేవలం ట్రాక్టర్ డీజిల్, ఇతర అత్యవసర పనులకోసం నెలకు రూ.5నుంచి రూ.6వేల వరకు ఖర్చు చేయాల్సి వస్తోంది. ఈ నేపథ్యంలో వేతనం వస్తే కుటుంబానికి ఖర్చు చేయాలో లేక పంచాయతీ పనుల కోసం వెచ్చించాలో అర్థం కాక కార్యదర్శులు తీవ్ర ఒత్తిడికి గురవుతున్నారు. మరోవైపు పంచాయతీల్లో పనులు చేయాలని ఉన్నతాధికారుల ఆదేశాలను అమలు చేయడానికి అప్పులు చేయాల్సిన దుస్థితి నెలకొంది.

జనరల్ ఫండ్‌దీ అదే పరిస్థితి..

పంచాయతీల్లో వసూలు చేసే ఇంటి పన్నులు, జరిమానాలు ఇతర ఆదాయాలను జనరల్ ఫండ్‌లో జమచేస్తారు. రెండు మూడు రోజుల్లో పంచాయతీ ఖాతాకు ఆ నగదు జమవుతుంది. కానీ పంచాయతీల అవసరాల కోసం జనరల్ ఫండ్ నుంచి డ్రా చేద్దామన్నా వీలుపడడం లేదు. అత్యవసర ఖర్చుల విత్‌డ్రా కోసం చెక్ చేస్తే ఆరు నుంచి పదినెలల సమయం పడుతుండడం గమనార్హం. పంచాయతీలు తాము సొంతంగా జమచేసిన నిధులను డ్రా చేయడానికి సైతం నెలల తరబడి సమయం పడుతోంది.

పారిశుధ్యం మాటేంటి ?

గ్రామాల్లో పారిశుధ్యం పనుల కోసం మండల వ్యాప్తంగా మొత్తం 37 ట్రాక్టర్లు అందుబాటులో ఉన్నాయి. వీటిలో పదిహేను ట్రాక్టర్లు మాత్రమే ఇళ్ల నుంచి చెత్తను సేకరిస్తాయి. నిధులు అందుబాటులో లేక అప్పుల పాలైన కార్యదర్శులు డీజిల్ కొనుగోలు చేసేందుకు డబ్బులు లేక అవి నామమాత్రంగానే రోడ్డెక్కుతున్నాయి. ప్రస్తుత వర్షాకాలంలో సీజనల్ వ్యాధులు ప్రబలే అవకాశం ఉండడంతో నిత్యం చెత్తను సేకరించాల్సిన ట్రాక్టర్లు అడపా దడపా రోడ్డెక్కడం ఏంటని గ్రామాల్లో ప్రజలు ఆక్షేపిస్తున్నారు. స్థానిక పంచాయతీ వాట్సప్ గ్రూపులలో కార్యదర్శులు కూడా సభ్యులుగా ఉండడంతో వారికి ఒక్కోసారి ఇబ్బందులు తప్పడం లేదు. పాడైన వీధి దీపాలను సకాలంలో వేయలేకపోయినా, పైపులైన్ లీకుల సమస్యను పరిష్కరించలేకపోయినా ఇబ్బందులు తప్పడం లేదు. ఎలక్ట్రికల్, శానిటేషన్ దుకాణాల్లో అప్పులు పుట్టకపోవడంతో తీవ్ర ఇబ్బందులెదుర్కొంటున్నారు.

పడిపోతున్న సిబిల్ స్కోర్

పంచాయతీ ట్రాక్టర్ల రుణవాయిదాల చెల్లింపులో జాప్యంతో కార్యదర్శుల సిబిల్‌స్కోరు పడిపోతోంది. గత ప్రభుత్వ హయాంలో ప్రతి పంచాయతీలో పారిశుధ్య నిర్వహణకు ట్రాక్టర్లను కొనుగోలు చేశారు. ఆర్థిక స్తోమత ఉన్న కొన్ని పంచాయతీలు పూర్తిగా నగదు చెల్లించి ట్రాక్టర్లను కొనుగోలు చేయగా, కొన్ని పంచాయతీలు బ్యాంకు రుణాలు తీసుకున్నాయి. అయితే ప్రభుత్వం నుంచి నిధులు అందుబాటులో లేకపోవడంతో నెలవారీ ట్రాక్టర్ రుణ వాయిదా చెల్లింపులు నిలిచిపోయాయి. దీంతో పంచాయతీ కార్యదర్శుల సిబిల్ స్కోరు పడిపోతోంది. బ్యాంకు ఖాతాకు కార్యదర్శి సెల్‌ఫోన్ నెంబర్, పాన్‌కార్డులు అనుసంధానం కావడంతో ఈ పరిస్థితి ఏర్పడింది. వ్యక్తిగత బ్యాంకు రుణాలు పొందాలంటే ఎంతో ముఖ్యమైన సిబిల్ స్కోర్‌ను తమ ప్రమేయం లేకుండా కోల్పోవడం పంచాయతీ కార్యదర్శులను బాధిస్తోంది.

పంచాయతీ ఎన్నికల ఖర్చులు తప్పవా?

ప్రస్తుత ఆర్థిక సమస్యలతో పాటు రానున్న స్థానిక సంస్థల ఎన్నికల ఖర్చుల భారం సైతం పంచాయతీ కార్యదర్శులపై పడే అవకాశం ఉంది. సిబ్బందికి భోజనాలు, టెంట్, తాగునీటి ఏర్పాటు తదితర ఖర్చులు పూర్తిగా వారే మోయాల్సి ఉంటుంది. ఖర్చులకు ముందు పెట్టుబడి పెడితే తర్వాత బిల్లు మంజూరు చేస్తారు. అయితే ప్రస్తుత నిధుల పరిస్థితిని గమనిస్తున్న కార్యదర్శులు మరోమారు తమకు అప్పుల తిప్పలు తప్పవనే ఆందోళనలో ఉన్నారు. అత్యవసరమైన పనులకు నిధుల కేటాయింపుతో పాటు, పెండింగ్ బిల్లులను మంజూరు చేయాలని కోరుతున్నారు.

రోడ్డుపై ప్రమాదకరంగా మట్టి కుప్పలు



పూసలపాడులో ఆర్అండ్‌బీ రోడ్డుపైనే ఉన్న మట్టి కుప్పలు

వైరా, జూలై 4 (ఆంధ్రజ్యోతి): మండలంలోని పూసలపాడు గ్రామంలో మిషన్ భగీరథ అధికారుల నిర్లక్ష్యంతో వాహనచోదకులు ప్రమాదాల బారీనపడుతున్నారు. మిషన్ భగీరథ పైపులైన్ మరమ్మతుల కోసం పదిరోజుల కిందట ఎక్స్‌కవేటర్‌తో తవ్వకాలు జరిపిన మట్టిని ఆర్అండ్‌బీ రోడ్డు మధ్యలో పోశారు. పూసలపాడు గ్రామంలో రిజర్వాయర్ ఎడమకాల్వ పక్కన సిరిపురం పంచాయతీకి చెందిన పైపలైన్ మొదట పగిలిపోయింది. ఆ పక్కనే ఉన్న మిషన్ భగీరథ పైపులైన్ కూడా దెబ్బతిని నీరు లీకైంది. దాంతో వాటి మరమ్మతుల కోసం భారీగా కందకాలు తవ్వి ఆ మట్టి మొత్తాన్ని వైరా-నెమలి వెళ్లే ఆర్అండ్‌బీ రోడ్డు మధ్యలో పోశారు. రోడ్డుకు ఒకవైపున పూర్తిగా మట్టి పోసి ఉండడంతో రాత్రివేళ ఈ రోడ్డులోని వాహనచోదకులు ప్రమాదాల బారీనపడుతున్నారు. ముఖ్యంగా ద్విచక్రవాహన చోదకులు ఈ మట్టి వద్ద మట్టి కుప్పలను ఢీకొని పడిపోయ గాయాలతో ఆస్పత్రి పాలవుతున్నారు. అయినప్పటికీ ఈ మట్టిని తొలగించేందుకు సంబంధిత అధికారులు ఎలాంటి చర్యలు తీసుకోవడం లేదు. ఇప్పటికైనా ఈ మట్టిని తొలగించాలని ప్రజలు కోరుతున్నారు.

సకాలంలో మెడికల్ క్యాంపులు ఏర్పాటు చేయాలి

క్రేంద్ర ప్రభుత్వ గిరిజన సంక్షేమ శాఖ డిప్యూటీ సెక్రటరీ డాక్టర్ రాజి



వీసీలో మాట్లాడుతున్న రాజి, హాజరైన జిల్లా అధికారులు

భద్రాచలం,జూలై 4(ఆంధ్రజ్యోతి): గిరిజన గ్రామాల్లో సకాలంలో మెడికల్ క్యాంపులు ఏర్పాటు చేసి అన్ని రకాల వ్యాధి నిర్ధారణ పరీక్షలు చేయాలని కేంద్ర ప్రభుత్వ గిరిజన సంక్షేమశాఖ డిప్యూటీ సెక్రటరి డాక్టర్ రాజి అన్నారు. శుక్రవారం మినిస్ట్రీ ఆఫ్ ట్రైబల్ వెల్ఫేర్ కార్యాలయం న్యూఢిల్లీ నుంచి వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించారు. రాష్ట్రాల వారిగా గిరిజన గ్రామాల్లో గిరిజన కుటుంబాలకు ప్రాణాంత వ్యాధుల బారిన పడకుండా చేపట్టవలసిన కార్యాచరణపై సమీక్షించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ప్రతీ ఒక్కరికి రక్తపరీక్షలు నిర్వహించాలని అన్నారు. స్థానిక గ్రామస్థులకు పరిసరాల పరిశుభ్రంపై అవగాహన కల్పించాలని ఈ ఏరియాలో ఎక్కడ కూడా దోమలు ప్రబలకుండా ఫాగింగ్ చేయించాలని వైద్య సిబ్బందికి సూచించారు. పీహెచ్‌సీల్లో సికిల్‌సెల్, అనీమియా, ఇతర టెస్టుకు సంబంధించిన పరికరాలు అవసరం ఉంటే సోమవారం వరకు ప్రతిపాదనలు పంపించాలని అన్నారు. భద్రాచలం పరిధిలో ఉన్న పీహెచ్‌సీల్లో డాక్టర్ల కొరత ఉందని, గైనకాలజిస్టులు, ఫిజియోథెరపి మిషన్లు, సీఎస్‌సీల్లో స్కానర్, ఆటోమెటిక్ ఎక్సరే, డిజిటల్ సిటి స్కాన్ మిషన్లు, డాక్టర్లు సమకూర్చాలని ఐటీడీఏ సహాయ ప్రాజెక్టు అధికారి జనరల్ డేవిడ్ రాజ్ డిప్యూటీ సెక్రటరికీ తెలిపారు. ఈ కాన్ఫరెన్స్‌లో భద్రాచలం ఏరియా ఆసుపత్రి పర్యవేక్షకుడు రామకృష్ణ, ప్రోగ్రాం ఆఫీసర్ రాము పాల్గొన్నారు.

కొణిజేటి రోశయ్యకు ఘన నివాళి



గంగారం బెటాలియన్‌లో నివాళులర్పిస్తున్న కమాండెంట్ పెదబాబు

సత్తుపల్లి, జులై3 (ఆంధ్రజ్యోతి): ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రిగా కొణిజేటి రోశయ్య అనేక సంక్షేమ, అభివృద్ధి పథకాలను అందించారని వక్తలు పేర్కొన్నారు. శుక్రవారం రోశయ్య జయంతి సందర్భంగా పలుచోట్ల కార్యక్రమాలు నిర్వహించారు. సత్తుపల్లి 15వ పోలీస్ బెటాలియన్‌లో కమాండెంట్ ఎన్.పెదబాబు రోశయ్య చిత్రపటం వద్ద పూలు జల్లి నివాళులర్పించారు. విద్యావేత్తగా, బహుభాషా ప్రావిణ్యుడు అయిన రోశయ్యను 2007లో ఆంధ్రా విశ్వవిద్యాలయం గౌరవ డాక్టరేట్‌ను ప్రదానం చేసిందని, అలాంటి మహనీయుల ఆశయసాధనకు అందరం కృషి చేయాలని కోరారు. కార్యక్రమంలో అదనపు దళాదిపతి ఏ.అంజయ్య, సహాయ దళాధిపతి ఎస్‌డీ. రంగారావు, ఆర్ఐలు, ఆర్ఎస్ఐలు, పటాలపు ఇతర అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.

కల్లూరు, జూలై 4 (ఆంధ్రజ్యోతి) : హైదరాబాద్‌లో జరిగిన కొణిజేటి రోశయ్య కాంస్య విగ్రహా ఆవిష్కరణ కార్యక్రమానికి జిల్లా ఆర్యవైశ్య సంఘం అధ్యక్షుడు పసుమర్తి చందర్‌రావుతో పాటు పలువురు ఆర్యవైశ్య ప్రముఖులు తరలివెళ్లారు. ఆయన విగ్రహానికి పూలమాలలు వేసి ఘన నివాళులర్పించారు. ఈ సందర్భంగా ఏపి ఉమ్మడి తెలుగు రాష్ట్రాలకు పలు ప్రభుత్వ హోదాల్లో సీఎంగా రోశయ్య చేసిన సేలవలను వారు కొనియాడారు. వారిలో జిల్లా ఆర్యవైశ్య సంఘం ప్రధాన కార్యదర్శి రాధాకృష్ణమూర్తి, భద్రాద్రి కొత్తగూడెం జిల్లా ఆర్యవైశ్యం సంఘం అధ్యక్షుడు దారా రమేష్, నాయకులు ఆర్.గణేష్ గుప్తా, ఎ.వెంకటేష్, నాగేశ్వరరావు పాల్గొన్నారు.



హైదరాబాద్‌లో నివాళులర్పిస్తున్న జిల్లా ఆర్యవైశ్య సంఘం అధ్యక్షుడు చందర్‌రావు



రోశయ్య విగ్రహాన్ని ఆవిష్కరిస్తున్న ఖర్గే, చిత్రంలో సీఎం రేవంత్ రెడ్డి

క్రమశిక్షణకు మారు పేరు రోశయ్య

- యువనేతలకు ఆదర్శం ఆయన జీవితం
- మాజీ సీఎం రోశయ్య 92వ జయంతి సభలో మంత్రులు శ్రీధర్‌బాబు, జూపల్లి, పొన్నం
- చాగంటికి సత్కారంతో పాటు ప్రశంసా పత్రం

హైదరాబాద్/హైదరాబాద్ సిటీ/ఖైరతాబాద్/రవీంద్రభారతి, జూలై 4 (ఆంధ్రజ్యోతి): క్రమశిక్షణకు మారు పేరు.. అజాత శత్రువుగా తెలుగు ప్రజల మనసుల్లో సుస్థిరస్థానం సంపాదించుకున్న నేత మాజీ సీఎం కొణిజేటి రోశయ్య అని మంత్రులు శ్రీధర్‌బాబు, పొన్నం ప్రభాకర్, జూపల్లి కృష్ణారావు కొనియాడారు. నేటి యువతరం రోశయ్య రాజకీయ జీవితాన్ని ఆదర్శంగా తీసుకోవాలని, ఉమ్మడి రాష్ట్రంలో 16 సార్లు అసెంబ్లీలో బడ్జెట్ ప్రవేశపెట్టి రికార్డు సృష్టించారని చెప్పారు. శుక్రవారం హైదరాబాద్‌లోని రవీంద్రభారతిలో రోశయ్య 92వ జయంతి సభను తెలంగాణ ప్రభుత్వ భాషా సాంస్కృతిక శాఖ, కొణిజేటి రోశయ్య మెమోరియల్ ట్రస్ట్‌ల ఆధ్వర్యంలో నిర్వహించారు. ఈ సందర్భంగా రోశయ్య చిత్రపటానికి మంత్రులు, అసెంబ్లీ స్పీకర్ గడ్డం ప్రసాద్‌కుమార్, శాసనమండలి చైర్మన్ గుత్తా సుఖేందర్ రెడ్డి, మేయర్ గద్వాల విజయలక్ష్మి, రోశయ్య కుటుంబ సభ్యులు శివసుబ్బారావు తదితరులు నివాళులర్పించారు. అనంతరం ప్రవచన కర్త, ఆధ్యాత్మికవేత్త చాగంటి కోటేశ్వరరావును ఘనంగా సత్కరించి ప్రశంసా పత్రాన్ని అందజేశారు. చాగంటి మాట్లాడుతూ.. రోశయ్య గవర్నర్‌గా ఉన్న సమయంలో చెన్నైలో ప్రవచనాలు చెప్పేందుకు వెళ్లినప్పుడు రాజ్‌భవన్ నుంచి బయటొకొచ్చి మరీ ఆయన స్వాగతం పలికారని గుర్తు చేసుకున్నారు. మంత్రులు శ్రీధర్‌బాబు, జూపల్లి మాట్లాడుతూ.. రోశయ్య ఎప్పుడూ అందరికీ ఆదర్శ నాయకత్వాన్ని అందించే లక్ష్యంతో పనిచేశారని చెప్పారు. ఉమ్మడి ఆంధ్రప్రదేశ్‌లో ముఖ్యమంత్రిగా ఆదర్శ రాజకీయ నేతగా గుర్తింపు తెచ్చుకున్నారన్నారు. స్పీకర్ గడ్డం ప్రసాద్ మాట్లాడుతూ.. 16 ఏళ్ల అప్పులు చేయకుండా ఉన్న దాంట్లో నిధులు సర్దుబాటు చేసి రాష్ట్రాన్ని అభివృద్ధి పథంలో ముందుకు తీసుకెళ్లిన గొప్ప నేత రోశయ్య అని అన్నారు. ప్రభుత్వం అధికారికంగా ఆయన జయంతి నిర్వహించడం అభినందనీయమని.. ఆయన వాగ్ధాటి, ఛలోక్తులను ఎవరూ మర్చిపోరని చెప్పారు. రోశయ్య ఆలోచనలు, ఆయన దూరదృష్టితో తీసుకున్న నిర్ణయాలను పార్టీలకతీతంగా ఇప్పుడు అనుసరించాల్సిన అవసరముందని గుత్తా అన్నారు. ఇటు డీజీపీ కార్యాలయంలోనూ రోశయ్య జయంతి సందర్భంగా ప్రత్యేక కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా రోశయ్య చిత్రపటానికి అదనపు డీజీపీ మహేశ్ భగవత్ పూలమాల వేసి నివాళులర్పించారు.

రోశయ్య కాంస్య విగ్రహాన్ని ఆవిష్కరించిన ఖర్గే

మాజీ సీఎం రోశయ్య కాంస్య విగ్రహం హైదరాబాద్‌లో ఆవిష్కృతమైంది. లక్డీకాపూల్‌లోని సైఫాబాద్ పోలీస్‌స్టేషన్ ప్రాంగణంలో 450 కిలోల బరువుతో ఏర్పాటు చేసిన రోశయ్య కాంస్య విగ్రహాన్ని ఆయన జయంతి సందర్భంగా ఏఐసీసీ అధ్యక్షుడు మల్లికార్జున ఖర్గే ఆవిష్కరించారు. సీఎం రేవంత్ రెడ్డితో పాటు డిప్యూటీ సీఎం భట్టి, మంత్రులు కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డి, శ్రీధర్‌బాబు, పొంగులేటి శ్రీనివాస్‌రెడ్డి, పొన్నం ప్రభాకర్, టీపీసీసీ చీఫ్ మహేశ్ గౌడ్ కార్యక్రమానికి హాజరయ్యారు. కాంగ్రెస్ ఎంపీ అనిల్‌కుమార్ యాదవ్, ఎమ్మెల్యే దానం నాగేందర్, ఎమ్మెల్సీలు బల్మూరి వెంకట్, దయానంద్, సీనియర్ నేతలు వి.హన్మంతరావు, కేవీపీ రామచంద్రరావు, టీజీ వెంకటేశ్, ఆర్యవైశ్య మహాసభ తెలంగాణ అధ్యక్షుడు అమరవాది లక్ష్మీనారాయణ, రోశయ్య కుటుంబ సభ్యులు శివసుబ్బారావు, మూర్తి పాల్గొన్నారు.

గ్రూపులు కడతామంటే.. భయపడం!

(మొదటిపేజీ తరువాయి)

కమిటీల ఉమ్మడి, విస్తృత కార్యవర్గ సమావేశాల్లో ఖర్గే దిశానిర్దేశం చేశారు. ఇందులో ఏఐసీసీ ప్రధాన కార్యదర్శి కేసీ వేణుగోపాల్, సీఎం రేవంత్‌రెడ్డి, డిప్యూటీ సీఎం భట్టి, టీపీసీసీ చీఫ్ మహేశ్‌గౌడ్, రాష్ట్ర వ్యవహారాల ఇన్‌చార్జి మీనాక్షి పాల్గొన్నారు.

తెలంగాణ.. కాంగ్రెస్‌కు మోడల్ స్టేట్!

తెలంగాణను కాంగ్రెస్ మోడల్ స్టేట్‌గా దేశానికి చూపనున్నట్టు ఖర్గే చెప్పారు. కాంగ్రెస్ సైద్ధాంతాలకు అనుగుణంగానే రేవంత్ ప్రభుత్వం పనిచేస్తోందన్నారు. ఆర్థికంగా ఇబ్బందులున్నా హామీలను సమర్థంగా అమలు చేయడం అభినందనీయమని ప్రశంసించారు. నేతలు పార్టీ ఇచ్చిన పదవులను సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. జూబ్లీహిల్స్ ఉప ఎన్నికల్లో కాంగ్రెస్ గెలిచి తీరాలన్నారు. అంతకుముందు జూబ్లీహిల్స్ ఉప ఎన్నికలకు తాము సిద్ధంగా ఉన్నామని సీఎం రేవంత్ సమావేశంలో చెప్పారు. ఇక రేవంత్ మంత్రివర్గంలో పనిచేయాలన్నది తన కోరికని, జూబ్లీహిల్స్ టికెట్ ఇవ్వాలని మాజీ ఎంపీ అంజన్‌కుమార్ యాదవ్ చెప్పారు.

మంత్రులపై సీఎం రేవంత్ అసంతృప్తి!

మంత్రులు, ఆయా జిల్లాల్లో ఇన్‌చార్జి బాధ్యతలు నిర్వహిస్తున్న నేతల తీరుపై సీఎం రేవంత్‌రెడ్డి తీవ్ర అసంతృప్తి వ్యక్తం చేశారు. జిల్లా, రాష్ట్ర స్థాయిల్లో నామినేటెడ్ పోస్టులకు ప్రతిపాదనలను షార్ట్ లిస్ట్ చేసి పంపాలని మంత్రులు, పీసీసీ చీఫ్‌ను నాలుగు నెలలుగా కోరుతున్నా.. స్పందించడం లేదని పేర్కొన్నారు. ప్రతిపాదనలు పంపితే వెంటనే ఆమోదిస్తానని చెప్పారు. ప్రభుత్వం ఏర్పడగానే ప్రతిపాదనలను షార్ట్ లిస్ట్ చేసి ఉంటే.. నామినేటెడ్ పోస్టుల్లో ఒక టర్మ్ అవకాశాలు పూర్తయ్యేవని వివరించారు.

నెలాఖరుకల్లా నామినేటెడ్ పోస్టుల భర్తీ:ఖర్గే

జూలై నెలాఖరుకల్లా నామినేటెడ్ పోస్టులను భర్తీ చేయాలని సీఎం రేవంత్, మంత్రులు, టీపీసీసీ చీఫ్‌కు ఖర్గే స్పష్టం చేశారు. దీన్ని సమన్వయం చేసుకునే బాధ్యత పీసీసీ చీఫ్‌దేనని.. పార్టీ కోసం కష్టపడిన వారికి, సమర్థులకే పదవులు ఇవ్వాలని సూచించారు. 'ప్రభుత్వంపై పార్టీ ఫిర్యాదు చేయడం చూశాం గానీ, పార్టీపై ప్రభుత్వం ఫిర్యాదు చేయడం ఇక్కడే చూస్తున్నా' అని ఖర్గే వ్యాఖ్యానించారు. బీఆర్ఎస్ హయాంలో కాంగ్రెస్ కార్యకర్తలపై పెట్టిన కేసులను ఎత్తివేసేందుకు చర్యలు చేపట్టాలని సీఎం రేవంత్‌కు ఖర్గే సూచించారు. పార్టీకి కార్యకర్తలే బలమని, కాపాడుకోవాలని చెప్పారు.



గాంధీభవన్ చేరుకున్న కాంగ్రెస్ చీఫ్ ఖర్గేతో సీఎం రేవంత్

పార్టీ పదవులను తేలికగా తీసుకోవద్దు: సీఎం

నేతలు పార్టీ పదవులను తేలికగా తీసుకోవద్దని సీఎం రేవంత్ సూచించారు. పార్టీ పదవులతో గుర్తింపు, గౌరవం దక్కుతాయని, రాజకీయాల్లో ఎదుగుదలకు దోహదపడతాయని చెప్పారు. భవిష్యత్తులో అసెంబ్లీ, పార్లమెంట్ సీట్లు పెరుగుతాయని, ఎక్కువ మందికి అవకాశాలు వస్తాయని వివరించారు. నూతన నాయకత్వానికి 2029 ఎన్నికలు వేదిక కావాలని కోరారు. అందరూ కష్టపడి పనిచేసి.. కాంగ్రెస్‌ను రెండో సారి అధికారంలోకి తీసుకురావాలన్నారు. రాష్ట్రంలో వచ్చే పదేళ్లూ కాంగ్రెస్‌దే అధికారమని ధీమావ్యక్తం చేశారు. పీసీసీ చీఫ్ మహేశ్‌గౌడ్ మాట్లాడుతూసామాజిక న్యాయం కాంగ్రెస్‌తోనే సాధ్యమని చెప్పారు. వచ్చే ఎన్నికల్లో 90 సీట్లతో అధికారంలోకి రావడం ఖాయమని ధీమా వ్యక్తం చేశారు.

అనిరుధ్‌రెడ్డి వ్యాఖ్యలపై ఏం చేద్దాం?

ఈ నెల 7న క్రమశిక్షణా చర్యల కమిటీ భేటీ

తెలంగాణలో టీడీపీ కోవర్టులున్నారంటూ కాంగ్రెస్ ఎమ్మెల్యే అనిరుధ్ రెడ్డి చేసిన వ్యాఖ్యలు, వాటిపై వచ్చిన ఫిర్యాదులపై టీపీసీసీ క్రమశిక్షణా చర్యల కమిటీ జూలై 7న గాంధీభవన్‌లో భేటీ కానుంది. ఆధారాలు చూపకుండా అనిరుధ్‌రెడ్డి చేసిన వ్యాఖ్యలను పార్టీ తీవ్రంగా పరిగణిస్తోందంటూ టీపీసీసీ చీఫ్ మహేష్‌కుమార్‌గౌడ్ ఇప్పటికే ప్రకటించారు. పార్టీ ఎమ్మెల్యే అయినందున.. అనిరుధ్‌రెడ్డికి క్రమశిక్షణా చర్యల కమిటీ షోకాజ్ నోటీసు జారీ చేస్తుందా లేక చర్యల కోసం ఏఐసీసీ క్రమశిక్షణా కమిటీకి సిఫార్సు చేస్తుందా అన్నది చర్చనీయాంశంగా మారింది. ఇలా ఉంటే గాంధీభవన్‌లో చైర్మన్ మల్లురవి అధ్యక్షతన క్రమశిక్షణా చర్యల కమిటీ భేటీ అయింది. ఉమ్మడి వరంగల్ జిల్లాలో నేతల వివాదంపై పార్టీ ఎమ్మెల్యే నాయిని రాజేందర్‌రెడ్డి అభిప్రాయం సేకరించింది. అనంతరం మీడియాతో నాయిని రాజేందర్‌రెడ్డి మాట్లాడుతూ జిల్లాలో తాజా రాజకీయ పరిస్థితులపై కమిటీ పెద్దలు తనతో మాట్లాడారన్నారు. చిన్న చిన్న బేధాభిప్రాయాలు మాత్రమే ఉన్నాయని, త్వరలో అన్ని సమస్యలూ పరిష్కారం అవుతాయని చెప్పారు.

డీ అడిక్షన్ కేంద్రాల ఏర్పాటు చారిత్రాత్మక మైలురాయి

- సుప్రీం కోర్టు చీఫ్ జస్టిస్ సూర్యకాంత్

హైదరాబాద్/సైదాబాద్/యాదగిరిగుట్ట, జూలై 4 (ఆంధ్రజ్యోతి): నేరాలు పాల్పడి జైలుకు వచ్చిన వారిలో పరివర్తన తీసుకురావడమే లక్ష్యంతో రాష్ట్ర జైళ్లలో డీ అడిక్షన్ కేంద్రాలు ఏర్పాటు చేయడం చారిత్రాత్మక మైలురాయిగా నిలిచిందని సుప్రీం కోర్టు న్యాయమూర్తి, నేషనల్ లీగల్ సర్వీసెస్ ఎగ్జిక్యూటివ్ చైర్మన్ జస్టిస్ సూర్యకాంత్ అన్నారు. చంచల్‌గూడ జైలులో నివృత్తి డీ అడిక్షన్ సెంటర్‌ను శుక్రవారం హైకోర్టు తాత్కాలిక ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ సుజోయ్‌పాల్‌తో కలిసి ఆయన ప్రారంభించారు. మత్తుకు బానిసైన ఖైదీలకు వైద్య చికిత్స, కౌన్సిలింగ్‌ల ద్వారా మంచి పౌరులుగా తీర్చిదిద్దే లక్ష్యంగా డీ అడిక్షన్ కేంద్రాల ఏర్పాటు అభినందనీయమని చెప్పారు. జస్టిస్ సుజోయ్‌పాల్ మాట్లాడుతూ ఖైదీలు మత్తు వ్యసనాన్ని అధిగమించి వారి జీవితాలను పునర్నించడానికి సహాయపడే వాతావరణం చంచల్‌గూడ జైలులో ఉందని ప్రశంసించారు. కాగా, అంతకు ముందు యాదగిరిగుట్ట లక్ష్మీనృసింహుడిని జస్టిస్ సూర్యకాంత్ దర్శించుకున్నారు. ఆయనకు ఆలయ అర్చకులు పూర్ణకుంభంతో స్వాగతం పలికి వేద ఆశీర్వచనం చేశారు. గర్భాలయంలో స్వయంభువులకు ప్రత్యేక పూజలు చేశారు. అనంతరం ఆలయ అధికారులు స్వామివారి ప్రసాదాన్ని, చిత్రపటాన్నిన్యాయమూర్తికి అందజేశారు. కాగా, బాలల హక్కుల రక్షణ అంశంపై 'వాయిస్ ఫర్ ది వాయిస్‌లెస్' అనే పేరుతో శని, ఆదివారాల్లో రాష్ట్ర స్థాయి స్టేక్ హోల్డర్ల సదస్సు జరగనుంది. ఈ సదస్సుకు సుప్రీం కోర్టు జడ్జి జస్టిస్ సూర్యకాంత్ ముఖ్య అతిథిగా హాజరుకానున్నారు. ఈ సదస్సులో సీఎం రేవంత్ రెడ్డి, హై కోర్ట్ చీఫ్ జస్టిస్ సుజోయ్ పాల్, డీజీపీ జితేందర్ తదితరులు పాల్గొననున్నారు.



జస్టిస్ సూర్యకాంత్‌కు నృసింహుడి చిత్రపటాన్ని అందజేస్తున్న ఆలయ ఈఓ

34 కోట్ల రన్యారావ్ ఆస్తులు అటాచ్ చేసిన ఈడీ

బెంగళూరు, జూలై 4 (ఆంధ్రజ్యోతి): బంగారం అక్రమ రవాణా కేసులో పట్టుబడిన నటి రన్యారావ్‌కు చెందిన రూ.34.12 కోట్ల విలువైన ఆస్తులను ఎన్‌ఫోర్స్‌మెంట్ డైరెక్టరేట్ (ఈడీ) అటాచ్ చేసింది. బెంగళూరు విక్టోరియా లే అవుట్‌లోని ఇల్లు, అర్కావతి లే అవుట్‌లో స్థలం, తుమకూరులో పారిశ్రామిక స్థలం, ఆనేకల్ తాలూకాలోని వ్యవసాయ భూమిని అటాచ్ చేశామని ఈడీ అధికారులు శుక్రవారం ప్రకటించారు. దుబాయ్ నుంచి రూ.12.56 కోట్ల విలువైన బంగారాన్ని తెస్తూ.. ఈఏడాది మార్చి 3న కెంపేగౌడ విమానాశ్రయంలో రన్యారావ్ పట్టుబడిన విషయం తెలిసిందే. ఈ కేసులో రన్యారావ్, రాజు, సాహిల్‌జైన్‌ను పోలీసులు అరెస్టు చేశారు. ముగ్గురూ పరప్పన అగ్రహార జైలులో ఉన్నారు.

తెరుచుకున్న తుంగభద్ర గేట్లు!

గద్వాల/దోమలపెంట, జూలై 4 (ఆంధ్రజ్యోతి): కృష్ణా బేసిన్ ప్రాజెక్టులకు క్రమంగా వరద పెరుగుతోంది. కృష్ణా, తుంగభద్ర నదుల ఎగువ ప్రాంతాల్లో కురుస్తున్న వర్షాలతో వరద పెరుగుతోంది. శుక్రవారం కర్ణాటకలోని తుంగభద్ర గేట్లు తెరుచుకున్నాయి. ప్రాజెక్టుకు 75,612 క్యూసెక్కుల ప్రవాహాలు చేరగా 58 గేట్లకు గాను 21 గేట్లను ఎత్తి 62,612 క్యూసెక్కులను దిగువకు విడుదల చేస్తున్నారు. ప్రాజెక్టు సామర్థ్యం 105.79 టీఎంసీలకు.. ప్రస్తుతం 75.84 టీఎంసీలున్నాయి. దిగువనున్న శ్రీశైలం ప్రాజెక్టుకు 1,09,777 క్యూసెక్కుల ఇన్‌ఫ్లో ఉండగా ఏపీ, తెలంగాణ విద్యుదుత్పత్తి కోసం 56,998 క్యూసెక్కులను వినియోగిస్తున్నారు. ప్రాజెక్టు పూర్తి సామర్థ్యం 215 టీఎంసీలకు ప్రస్తుతం 169.86 టీఎంసీలున్నాయి. తుంగభద్ర గేట్లు తెరవడంతో శ్రీశైలానికి వరద మరింత పెరిగే అవకాశముంది. ఇక ఆల్మట్టికి వరద స్థిరంగా కొనసాగుతోంది. 94,767 క్యూసెక్కుల ఇన్‌ఫ్లో ఉండగా.. లక్ష క్యూసెక్కులను దిగువకు విడుస్తున్నారు. జూరాలకు 1.15 లక్షల క్యూసెక్కుల ప్రవాహాలు వస్తుండగా 14గేట్ల ద్వారా 95,566, విద్యుదుత్పత్తి ద్వారా 29,494 క్యూసెక్కులను దిగువకు విడుదల చేస్తున్నారు.

బ్రిడ్జిలు, సొరంగాలున్న హైవేలపై టోల్ చార్జీలు సగానికి తగ్గింపు

న్యూఢిల్లీ, జూలై 4: జాతీయ రహదారులపై సొరంగాలు, బ్రిడ్జిలు, ఫ్లైఓవర్లు లేదా ఎలివేటెడ్ హైవేలు వంటి నిర్మాణాలున్న భాగాలకు టోల్ రేట్లను కేంద్ర ప్రభుత్వం 50శాతం వరకు తగ్గించింది. ఈ మేరకు కేంద్ర రోడ్డు రవాణా, హైవేల మంత్రిత్వ శాఖ టోల్ చార్జీలను లెక్కించడానికి కొత్త పద్ధతి/ఫార్ములాను నోటిఫై చేస్తూ ఈ నెల 2న నోటిఫికేషన్ జారీ చేసింది. ప్రస్తుత నిబంధనల ప్రకారం.. జాతీయ రహదారిపై ఉండే ప్రతి కిలోమీటరు వంతెనలు లేదా సొరంగాలకు వాహనదారులు సాధారణ టోల్ కన్నా పది రెట్లు ఎక్కువ చెల్లిస్తున్నారు. దీన్ని సవరిస్తూ కేంద్రం నిర్ణయం తీసుకుంది. ఫ్లైఓవర్లు, అండర్‌పాస్‌లు, సొరంగాలున్న ప్రాంతాల్లో టోల్ రేటును 50 శాతం వరకు తగ్గించినట్టు ఓ అధికారి పేర్కొన్నారు.

బాలికను బడిబాట పట్టించాడు

- భిక్షాటన చేసుకునే చిన్నారి తల్లికి కౌన్సెలింగ్
- పాఠశాల సామగ్రి ఇచ్చిన ఉపాధ్యాయుడు భద్రు

మణుగూరు, జూలై 4(ఆంధ్రజ్యోతి): విధి చేతిలో వంచనకు గురైంది ఆ కుటుంబం. తండ్రి దివ్యాంగుడు.. మణుగూరు పట్టణ ప్రాంతంలోని చెరువు కట్ట వద్ద రోడ్డుపై నివాసముండే వారు. వారికి భిక్షాటన తప్ప వేరే పని తెలియదు. కొంత కాలం క్రితం ఆ తండ్రి మృతి చెందగా.. భార్య భిక్షాటన చేస్తూ సంతానాన్ని పోషించుకుంటోంది. అపరిశుభ్ర వాతావరణంలో రోడ్డు పక్కనే తల్లీకూతురు కాలం వెళ్లదీస్తున్నారు. వారి దీన స్థితిని చూసిన స్థానిక నాయకులు ఆవుల సర్వేశ్వరరావు, యాదగిరి గౌడ్ మరికొందరు ఏడాదిన్నర కిత్రం వారు నివాసం ఉండేందుకు ఓ రేకుల గదిని ఏర్పాటు చేశారు. కానీ పిల్లలు మాత్రం బడికి దూరంగా ఉంటూ భిక్షాటన చేసుకుంటూ ఉంటున్నారు. ఈ విషయాన్ని గమనించిన శివలింగాపురం ప్రాథమికోన్నత పాఠశాల తెలుగు ఉపాధ్యాయుడు మాలోత్ భద్రు చలించిపోయాడు. తన ఈడు పిల్లలు అంతా చక్కగా చదువుకుంటుంటే ఆ బాలిక ఇలా కన్పించడమేంటని ఆలోచించాడు. శుక్రవారం ఆ బాలిక తల్లికి కౌన్సెలింగ్ ఇచ్చి అమ్మాయి బడిబాట పడితే మంచి భవిష్యత్ ఉంటుందని వివరించాడు. ఆ బాలిక కూడా తాను చదువుకుంటానని చెప్పడంతో.. రోజూ తానే బాలికను పాఠశాలకు తీసుకెళ్లి.. మళ్లీ ఇంటివద్ద వదిలిపెడతానని హామీ ఇచ్చాడు. అందుకు ఆ తల్లి సమ్మతించింది. దాంతో ఆ బాలికకు కావాల్సిన పలక బలపం, బ్యాగు, యూనిఫాంను అందజేసిన ఉపాధ్యాయుడు భద్రు తన ద్విచక్రవాహనంపై పాఠశాలకు తీసుకెళ్లాడు. ఓవీధి బాలిక విషయంలో ఉపాధ్యాయుడు చొరవ చూపిన భద్రును పాఠశాల హెచ్ఎంలతో పాటు తోటి ఉపాధ్యాయులు, స్థానికులు, మిత్రులు, నేతాజీ వాకర్స్ టీమ్ వారు అభినందించారు.



భిక్షాటన చేస్తున్న తల్లితో మాట్లాడుతున్న ఉపాధ్యాయుడు భద్రు



యూనిఫాం వేసుకుని బ్యాగ్‌తో బడికి వెళ్తున్న బాలిక

బాలికపై అత్యాచారం కేసులో 20ఏళ్ల జైలు

ఖమ్మం లీగల్, జూలై 4 (ఆంధ్రజ్యోతి): ఇంటి ముందు ఆడుకుంటున్న ఓ బాలికపై అత్యాచారం చేసిన నిందితుడికి 20ఏళ్ల జైలు శిక్ష, రూ.50వేలు జరిమానా విధిస్తూ ఖమ్మం పోక్సో రెండో కోర్టు ఇన్‌చార్జ్, ఒకటో అదనపు జిల్లా న్యాయాధికారి కె.ఉమాదేవి శుక్రవారం తీర్పు చెప్పారు. ఫిర్యాది కథనం ప్రకారం.. 2023 ఆగస్టు 13న మైనర్ అయిన తన కూతురు ఇంటి ఎదుట ఆడుకుంటుండగా.. ఖమ్మం జిల్లా సత్తుపల్లి మండలం కొత్తూరు గ్రామానికి చెందిన మామాడి పాపారావు (30) అనే వ్యక్తి మాయ మాటలు చెప్పి తీసుకెళ్లి అత్యాచారం చేశాడని సత్తుపల్లి పోలీసులకు ఫిర్యాదు చేశాడు. ఆ సమయంలో నిందితుడిపై కేసు నమో దు చేసిన పోలీసులు కోర్టులో ఛార్జిషీట్ దాఖలు చేశారు, ఆ కేసులో సాక్షులను విచారించిన న్యాయాధికారి నిందితుడిపై నేరం రుజువు కావడంతో 20ఏళ్ల జైలు శిక్ష, రూ.50వేల జరిమానా విధిస్తూ తీర్పు చెప్పారు. ప్రాసిక్యూషన్ తరుఫున పబ్లిక్ ప్రాసిక్యూటర్ ఎండి ఇర్షాద్ వాదించగా, లీగల్ ఆఫీసర్ ఎం ఉమారాణి, కోర్టు కానిస్టేబుల్ రవి కుమార్, కోర్ట్ లైజనింగ్ అధికారులు శ్రీకాంత్, కె శ్రీనివాసరావు, హోంగార్డు చిట్టిబాబులు సహకరించారు.

రోడ్డు ప్రమాదంలో టీడీపీ నాయకుడి దుర్మరణం

- ఖమ్మం రూరల్ మండల అధ్యక్షుడిగా పనిచేస్తున్న శ్రీనివాస్





నివాళులర్పిస్తున్న టీడీపీ నాయకుడు రామనాథం (ఇన్‌సెట్‌లో) శ్రీనివాస్‌గౌడ్(ఫైల్)

ఖమ్మం రూరల్, జూలై 4(ఆంధ్రజ్యోతి): ఖమ్మం రూరల్ మండల టీడీపీ అధ్యక్షుడు సానబోయిన శ్రీనివాస్ గౌడ్ (50) గురువారం రాత్రి రోడ్డు ప్రమాదంలో మృతిచెందాడు. పోలీసులు తెలిపిన వివరాలు.. నాయుడుపేటకు చెందిన శ్రీనివాస్‌గౌడ్, పసుపులేటి కృష్ణయ్య శ్రీనివాస్ ద్విచక్రవాహనంపై ఖమ్మం వెళ్లి తిరిగి నాయుడుపేటకు వస్తున్నారు. బైపాస్ రోడ్డువెంట సత్యనారాయణపురం గ్రామం వద్ద కృష్ణయ్య మూత్ర విసర్జనకోసం ద్విచక్రవాహనాన్ని రోడ్డు పక్కన నిలిపారు. కృష్ణయ్య బండి దిగగా శ్రీనివాస్ బండిపైనే కూర్చుని ఉన్నాడు. వెనుక నుంచి ఖమ్మం నుంచి వరంగల్ వైపు వెళ్లే డీసీఎం వాహనం అతివేగంగా వచ్చి రోడ్డు పక్కన ఉన్న శ్రీనివాస్ ద్విచక్రవాహనాన్ని ఢీకొట్టింది. ఈ ప్రమాదంలో శ్రీనివాస్‌కు తీవ్ర గాయాలయ్యాయి. వెంటనే ఖమ్మం ఆస్పత్రికి తరలించారు. మెరుగైన వైద్యంకోసం హైదరాబాద్ తరలిస్తుండగా మార్గం మధ్యలో శ్రీనివాస్ మృతిచెందాడు. కుటుంబ సభ్యుల ఫిర్యాదు మేరకు సర్కిల్ ఇన్‌స్పెక్టర్ రాజు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

విషయం తెలుసుకున్న టీడీపీ నాయకులు ఖమ్మం ప్రభుత్వ ఆస్పత్రికి చేరుకున్నారు. ఆయన మృతదేహాన్ని నాయుడుపేటలోని ఆయన స్వగృహానికి తరలించారు. అంతకు ముందు టీడీపీ జిల్లా కార్యాలయంలో కార్యకర్తల సందర్శనార్థం శుక్రవారం మధ్యాహ్నాం వరకు ఉంచారు. ఆయన మృతదేహన్ని టీడీపీ పార్లమెంట్ కన్వీనర్ డాక్టర్ వాసిరెడ్డి రామనాథం, రాష్ట్ర నాయకుడు కూరపాటి వెంకటేశ్వర్లు, పాలేరు ఇన్‌చార్జ్ కొండబాల కరుణాకర్‌ల శ్రీనివాస్ మృతదేహంపై టీడీపీ జెండా కప్పి నివాళులర్పించారు. అదేవిధంగా టీడీపీ నాయకులు రాంరెడ్డి, హరీష్, నాగేశ్వరరావు, సీతయ్య, మాజీ కార్పొరేటర్ నాగేశ్వరరావు, బీఆర్ఎస్ మండలాధ్యక్షుడు బెల్లం వేణుగోపాల్, సీపీఐ, సీపీఎం, కాంగ్రెస్, బీజేపీ, తదితర పార్టీల నాయకులు ఆయన మృతదేహన్ని సందర్శించి నివాళులర్పించారు.

మాజీ ఎంపీ నామా పరామర్శ

టీడీపీ మండలాధ్యక్షుడు శ్రీనివాస్‌గౌడ్ రోడ్డు ప్రమాదంలో మృతిచెందిన విషయం తెలుసుకున్న ఖమ్మం మాజీ ఎంపీ నామా నాగేశ్వరరావు వెంటనే ఫోన్‌లో వారి కుటుంబ సభ్యులను పరామర్శించారు. కుటుంబ సభ్యులకు తన ప్రగాఢ సానుభూతిని తెలియజేశారు.

మరో ప్రమాదంలో లస్కర్

బోనకల్, (ఆంధ్రజ్యోతి): మండలంలోని రావినూతల గ్రామం వద్ద శుక్రవారం జరిగిన రోడ్డు ప్రమాదంలో లస్కర్ మృతి చెందాడు. వివరాల్లోకి వెళ్తే కలకోట గ్రామానికి చెందిన యంగల అప్పయ్య(50) గతంలో వీఆర్‌ఏగా పని చేశాడు. ఇటీవల ఇరిగేషన్ శాఖలో బోనకల్ సబ్ డివిజన్ పరిధిలో లస్కర్‌గా పని చేస్తున్నాడు. విధి నిర్వహణలో భాగంగా స్వగ్రామం కలకోట నుంచి బోనకల్ వైపునకు ద్విచక్ర వాహనంపై వస్తుండగా గేదె అడ్డు రావడంతో సుబాబుల్ లోడ్‌తో వెళ్తున్న ట్రాక్టర్‌కు తగిలి కింద పడ్డాడు. తీవ్ర గాయాలు కాగా బోనకల్ పీహెచ్‌సీకి తరలిస్తున్న క్రమంలో మార్గమధ్యలో మృతి చెందాడు. మృతుడికి భార్య, కుమారుడు, కుమార్తె ఉన్నారు. ఈ సంఘటనపై ఎస్ఐ పొదిలి వెంకన్న కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

బురిడీ కొట్టించిన సైబర్ నేరగాడు

ఖమ్మం రూరల్, జూలై 4(ఆంధ్రజ్యోతి): తప్పిపోయిన వ్యక్తి ఆచూకీకోసం వెతుకుతున్న ఓ కుటుంబ సభ్యులను ఓ సైబర్ నేరగాడు బురిడీ కొట్టించిన సంఘటన ఖమ్మం రూరల్ మండలంలో ఇటీవల చోటుచేసుకుంది. కుటుంబ సభ్యులు, పోలీసులు తెలిపిన వివరాలప్రకారం ఏదులాపురం మునిసిపాలిటి పరిధిలోని పెద్దతండాకి చెందిన బానోత్ నరేశ్ అనే వ్యక్తి జూన్ 23న ఇంట్లో నుంచి వెళ్లిపోయాడు. దీనిపై బాధిత కుటుంబ సభ్యులు పోలీసులకు ఫిర్యాదు చేశారు. పోలీసులు కేసు నమోదు చేశారు. ఈ నెల 1న బాధిత కుటుంబ సభ్యులకు తప్పిపోయిన నరేశ్ అనే వ్యక్తి తన వద్దనే ఉన్నాడని, తాను ఫారెస్టు సీఐని అంటూ వాట్సప్‌లో మెసెజ్ పెట్టాడు. అడ్రస్ వివరాలు తెలియచేశాడు. తనకు రూ.1400లు ఫోన్‌పే చేయాలని కోరగా బాధితులు పంపించారు. బాధితులు ఈ విషయాన్ని పోలీసులకు తెలియచేశారు. పోలీసులు ఓ కానిస్టేబుల్‌ను ఇచ్చి కుటుంబ సభ్యుల తో పంపించాడు. కానిస్టేబుల్, బాధిత కు టుం బ సభ్యులు అక్కడికి వెళ్లి చూస్తే అదిఫేక్ సమాచారమని తెలిసింది. తమను సైబర్ నేరస్థులు తప్పుదోవ పట్టించారనే విషయాన్ని తెలుసుకుని వెనుదిరిగి వచ్చారు. ఫోన్ పే నంబర్ ఆధారంగా పోలీసులు విచారణ చేస్తున్నారు.

రోడ్డు ప్రమాదంలో ఇద్దరికి గాయాలు

మణుగూరు రూరల్, జూలై 4 (ఆంధ్రజ్యోతి): మండలంలోని రామానుజవరం గ్రామం ప్రధాన రహదారిపై ఆటో అదుపుతప్పి పల్టీ కొట్టిన సంఘటన శుక్రవారం ఇరవురు తీవ్ర గాయాలు అయ్యాయి. స్థానికులు వారిని మణుగూరు ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు.

రూ. 8 లక్షల బంగారం స్వాధీనం

ఖమ్మం ఖానాపురం హవేలి, జూలై 4(ఆంధ్రజ్యోతి): చోరీలకు పాల్పడుతున్న ముగ్గురు అంతరాష్ట్ర దొంగల నుంచి రూ. 8లక్షల బంగారం స్వాధీనపరుచుకొని అరెస్టు చేసినట్లు ఖమ్మం మూడో పట్టణ పోలీస్ స్టేషన్ ఇన్స్పెక్టర్ మోహన్‌బాబు తెలిపారు. పోలీసుల కథనం ప్రకారం 2024 డిసెంబరులో ఖమ్మం నయబజారులో జరిగిన దొంగతనంపై సీసీఎస్ పోలలీసులతో కలిసి విచారణ చేపట్టామని అన్నారు. జిల్లాలోని ఎర్రుపాలేనికి చెందిన ఫణీంధర్ తోపాటు నిజామాబాద్‌కు చెందిన సం పంగి. రాజేందర్, ఆలకుంట. మహేష్‌లను అదుపులోకి తీసుకోని విచారించామని అన్నారు. వారు ఖమ్మం నగరం, మధిర టౌన్‌లో రెండు చొప్పున, వైరా, రఘునాథపాలెం, మధిర రూరల్, ఆంధ్రప్రదేశ్‌లోని సామర్లకోట, అమలాపురం పోలీసు స్టేషన్‌లలో ఒక్కోక్కటి చొప్పున మొత్తం 10 చోరీలకు పాల్పడినట్లు అంగీకరించారని అన్నారు. వారి నుంచి రూ. 8లక్షల విలువైన బంగారం స్వాధీనం చేసుకున్నామని తెలిపారు.

అక్రమంగా తరలిస్తున్న రేషన్‌బియ్యం పట్టివేత

జూలూరుపాడు, జూలై 4(ఆంధ్రజ్యోతి): ట్రాలీ ఆటోలో అక్రమంగా తరలిస్తున్న రేషన్ బియ్యాన్ని పోలీసులు పట్టుకున్న సంఘటన శక్రువారం తెల్లవారుజామున బేతాళపాడు గ్రామ సమీపంలో చోటుచేసుకుంది. పోలీసులు తెలిపిన వివరాలు ఇలా వున్నాయి. సుజాతనగర్ గ్రామం చింతలతండా గ్రామానికి చెందిన మాలోత్ వినోద్‌కుమార్ అనే వ్యక్తి ప్రభుత్వం చౌకదుకాణాల ద్వారా లబ్ధిదారులకు పంపిణీ చేసిన బియ్యాన్ని జూలూరుపాడు మండలంలోని పలు గ్రామాలలో వారి వద్ద నుంచి తక్కువ ధరకు కొనుగోలు చేశారు. ఆ బియ్యాన్ని అధిక ధరకు విక్రయించేందుకు ట్రాలీ ఆటోలో మండలంలోని గుండ్లరేవు గ్రామం మీదగా సుజాతనగర్ వైపు తీసుకుని వెళుతున్నారు. ఈ క్రమంలో జూలూరుపాడు ఎస్ఐ బాదావత్ రవి తన సిబ్బందితో కలసి తెల్లవారుజామున 5 గంటల సమయంలో బేతాళపాడు గ్రామ శివారులో బియ్యం లోడుతో వెళుతున్న ట్రాలీ ఆటోని తనిఖీ చేశారు. దానిలో 5 క్వింటాల రేషన్ బియ్యం ఉండటంతో వాటిని స్వాదీనం చేసుకుని ట్రాలీ ఆటోను సీజ్ చేశారు. పట్టుబడిన బియ్యం విలువ రూ.11వేలు ఉంటుందని తెలిపారు. రేషన్ బియ్యాన్ని అక్రమంగా తరలిస్తున్న వినోద్ కుమార్‌పై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ తెలిపారు.



మనస్తాపంతో వివాహిత ఆత్మహత్య

బూర్గంపాడు, జూలై 4 (ఆంధ్రజ్యోతి): మనస్తాపంతో ఉరేసుకుని వివాహిత ఆత్మహత్య చేసుకున్న ఘటన శుక్రవారం బూర్గంపాడులో చోటుచేసుకుంది. పోలీసులు తెలిపిన వివరాలు ప్రకారం... బూర్గంపాడులోని ముదిరాజ్‌బజార్‌కు చెందిన నీరుడు సంధ్య(38) కొంత కాలంగా అనారోగ్యంతో బాధపడుతుంది. ఈ క్రమంలో చికిత్స పొందుతూ ఇంటి వద్దనే ఉంటుంది. శుక్రవారం భర్త శేషయ్య పనికి వెళ్లిన సమయంలో ఇంట్లో ఉరేసుకుని ఆత్మహత్యకు పాల్పడింది. గమనించిన కుటుంబసభ్యులు ఆసుపత్రికి తీసుకెళ్లగా పరీక్షించిన వైద్యులు అప్పటికే మృతి చెందినట్లు తెలిపారు. మృతురాలికి ఇద్దరు కుమారులు ఉన్నారు. గత కొంత కాలంగా అనారోగ్యంతో బాధపడుతుండడంతో మనస్తాపం చెంది ఆత్మహత్యకు పాల్పడినట్లు కుటుంబసభ్యులు తెలిపారు. మృతురాలి చెల్లి మేకల లీలావతి ఫిర్యాదు మేరకు ఎస్ఐ ప్రసాద్ కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు.

వైద్యం వికటించిందని ఆస్పత్రి ఎదుట ఆందోళన

పాల్వంచ టౌన్, జూలై 4 (ఆంధ్రజ్యోతి): పాల్వంచ మార్కెట్ ఏరియాలోని ఓ ప్రైవేటు ఆస్పత్రి ఎదుట వైద్యం వికటించిందని బాధితురాలు తమ బంధువులతో కలిసి శుక్రవారం ఆందోళనకు దిగారు. స్థానికుల కథనం ప్రకారం మార్కెట్ ఏరియాలో నివాసముంటున్న ఓ మహిళ తనకు ఆరోగ్యం బాగోలేదని వారం రోజుల క్రితం ఆదే మార్కెట్‌లోని ఓ ప్రైవేటు ఆస్పత్రికి వచ్చింది. వైద్యుడు పరీక్షించి విటమిన్ లోపం ఉందని సెలైన్లు ఎక్కించారు. దీంతో రెండు చేతులు వాచిపోయి ఉండటంతో కొత్తగూడెంలోని వేరే ఆస్పత్రికి వెళ్లి వైద్యం చేయించుకుంది. అక్కడి వైద్యులు చేతులకు ఇన్‌ఫెక్షన్ సోకిందని శస్త్ర చికిత్స చేశారు. దీంతో వైద్యం వికటించిందని సదరు మహిళ బంధువులతో కలిసి ఆస్పత్రి ఎదుట నష్టపరిహారం చెల్లించాలని ఆందోళనకు దిగింది. పోలీసుల రంగ ప్రవేశంతో ఆందోళన సద్దుమణిగింది.



హెడ్‌కానిస్టేబుల్‌కు ఉత్తమ సేవా పత్రం

తిరుమలాయపాలెం, జూలై4(ఆంధ్రజ్యోతి): తిరుమలాయపాలెం పోలీసుస్టేషన్‌లో హెడ్‌కానిస్టేబుల్‌గా విధులు నిర్వహిస్తున్న హరీ‌ష్‌కు ఉత్తమ సేవాపతకం లభించింది. శుక్రవారం వరంగల్ రేంజ్ డీఐజీ చేతుల మీదుగా సేవాపతకం అందుకున్నారు. హరీష్ నేరపరిశోధనలో అత్యంత ప్రతిభ కనబరిచినందుకుగాను ఆయనకు అధికారులు సేవాపతకం అందించారు. హరీష్ విధినిర్వాహణలో అంకితభావంతో పని చేసి కేసుల పరిశోధనలో కూడా పాల్గొని పలు కేసులు వెలికితీయడంతో అవార్డు లభించింది. ఎస్‌ఐ కూనపుడి జగదీష్ అభినందించారు.

మున్నేరుపై రాకపోకలకు సన్నాహాలు

- పాతవంతెనను సిద్ధం చేస్తున్న అధికారులు
- నేడో రేపో రాకపోకలకు అనుమతి ఇవ్వనున్న పోలీసులు



మున్నేరులో తాత్కాలికంగా వేసిన రోడ్డు కొట్టుకు పోయిన దృశ్యం

ఖమ్మంకలెక్టరేట్, జూలై4(ఆంధ్రజ్యోతి): మున్నేరు పాతవంతెనపై రాకపోకలకు పోలీస్, జిల్లా అధికారులు సన్నాహాలు చేస్తున్నారు. ఈనేపథ్యంలో శుక్రవారం సాయంత్రం ఆర్‌అండ్‌బీ, పోలీస్ అధికారులు సంయుక్తంగా వంతెనను పరిశీలించారు. తీగల వంతెన నిర్మాణ నేపథ్యంలో తొమ్మిది నెలల క్రితం పాత వంతెనపై రాకపోకలు నిషేధించారు. మున్నేరులో తాత్కాలికంగా చప్టాపై రోడ్డును ఏర్పాటు చేశారు. అయితే ఐదురోజులుగా కురుస్తున్న వర్షాలకు మున్నేటి నీటి ప్రవాహానికి తాత్కాలిక రోడ్డు కొట్టుకు పోయింది. రెండు రోజులుగా చప్టాపై రాకపోకలను నిలిపివేశారు. ఖమ్మం నుంచి జలగం నగర్ వైపు వెళ్లేందుకు, నాయుడు పేట నుంచి ఖమ్మం నగరంలోకి వెళ్లేందుకు చప్టాపై రాకపోకలను నిలిపివేసి బైపాస్‌రోడ్డు కరుణగిరి వంతెన మీదుగా రాకపోకలను సాగిస్తున్నారు. దీంతో ఇక్కడ ట్రాఫిక్ రద్దీ తీవ్రంగా పెరిగిపోయింది. నగరవాసులు, అత్యవసరం కోసం వెళ్లే ప్రజలు నానా అవస్థలు పడుతున్నారు. ఈ నేపథ్యంలో ట్రాఫిక్‌ను తగ్గించేందుకు మున్నేరు పాత వంతెనపై రాకపోకలకు గ్రీన్ సిగ్నల్ ఇవ్వనున్నట్లు తెలిసింది. అయితే శుక్రవారం సాయంత్రం మున్నేరు పాత వంతెనకు తాత్కాలికంగా మరమ్మతులు చేపట్టారు. తీగల వంతెన క్రేన్ నడిచేందుకు వీలుగా తవ్విన గుంతలను పూడ్చేశారు. సైడ్‌వాల్స్‌ను ఏర్పాటు చేశారు. పోలీసు అధికారులు కూడా వంతెనపై పనులను రాకపోకల సాధ్యాసాధ్యాలను పరిశీలించారు. ఈ నేపథ్యంలో నేడో రేపో పాత వంతెనపై రాకపోకలను పునరుద్ధరించనున్నట్లు పోలీస్ అధికారులు తెలిపారు.




పాత వంతెనకు తాత్కాలికంగా ఏర్పాటు చేసిన సైడ్‌వాల్స్, చిన్నచిన్న మరమ్మతులు చేసిన దృశ్యం

లోతట్టు ప్రాంతాల్లో... ముందస్తు చర్యలు చేపట్టాలి

- అన్ని శాఖల యంత్రాంగం సమన్వయంతో పని చేయాలి
- మరిన్ని పునరావాస కేంద్రాలు ఏర్పాటు చేయాలి
- కలెక్టర్ అనుదీప్ దురిశెట్టి



జలగంనగర్‌లో అధికారులతో మాట్లాడుతున్న కలెక్టర్

ఖమ్మంరూరల్, జూలై4(ఆంధ్రజ్యోతి): మున్నేరు లోతట్టు ప్రాంతాల్లో నష్ట నివారణకు ముందస్తు చర్యలు చేపట్టాలని కలెక్టర్ అనుదీప్ దురిశెట్టి ఆదేశించారు. ఏదులాపురం మునిసిపాలిటీ పరిధిలోని జలగంనగర్ కాలనీని శుక్రవారం పరిశీలించారు. అన్ని శాఖల యంత్రాంగం సమన్వయంతో కలిసి పని చేయాలన్నారు. గత అనుభవాలను దృష్టిలో ఉంచుకుని మరిన్ని పునరావాస కేంద్రాలు ఏర్పాటు చేయాలన్నారు. మున్నేరు వరదలలో లోతట్టు ప్రాంతాలలో ఆస్తి, ప్రాణ నష్టం వాటిల్లకుండా ప్రణాళిక చేపట్టాలన్నారు. వర్షాలు వచ్చినప్పుడు ముంపు ప్రాంతాలు, ప్రమాదకర నీటి వనరుల పట్ల ముందస్తుగా మ్యాపింగ్ చేసుకుని తగు జాగ్రత్తలు తీసుకోవాలన్నారు. ఆపదమిత్ర కింద యువతకు విపత్తు నిర్వహణపై శిక్షణ ఇచ్చినట్లు చెప్పారు. జిల్లాలో గ్రామీణ ప్రాంతాల్లో 139, పట్టణ ప్రాంతాల్లో 161 మంది యువతను నియమించామన్నారు. ప్రమాదకర మేజర్ రోడ్లను ముందస్తుగా ఆర్టీసీ బస్సులతో బ్లాక్ చేసే విధంగా చర్యలు తీసుకోవాలన్నారు. పర్యాటకులను ప్రమాదకర ప్రదేశాల్లో ఉండకుండా చర్యలు తీసుకోవాలన్నారు. విద్యుత్‌శాఖ అప్రమత్తంగా ఉండి ముంపు ప్రాంతాల్లో ఉన్న మేజర్ టవర్లకు ఏమైనా ఇబ్బందులు కలిగే సూచనలు ఉన్న చోట ముందస్తు చర్యలు చేపట్టాలన్నారు. జిల్లా కేంద్రంలో 1077 నెంబర్‌తో కంట్రోల్ రూమ్ పని చేస్తుందని తెలిపారు. గతఏడాది వరదల నేపథ్యంలో ఎన్డీఆర్ఎఫ్ బృందం మూడునెలలు జిల్లాలో అందుబాటులో ఉన్నాయన్నారు. వాతావరణశాఖ నుంచి వరద ముప్పు ఉందని హెచ్చరిక రాగానే జిల్లాలో జిల్లాలో వరద సమయంలో అవసరమైన బోట్లు, రోప్స్, లైఫ్ జాకెట్, మైక్స్ లైట్లు, జేసీబీ, క్లినింగ్ ఎక్విప్మెంట్ మొదలగు సామగ్రి డివిజన్, గ్రామం వారీగా అందుబాటులో పెట్టాలన్నారు. ఈ కార్యక్రమంలో ఆర్డీవో నరసింహరావు, సహాయ మున్సిపల్ కమిషనర్ సంపత్ కుమార్, తహసీల్దార్ రాంప్రసాద్, ఏదులాపురం మునిసిపల్ కమిషనర్ శ్రీనివాస్‌రెడ్డి, ఎంపీడీవో కుమార్, ఎన్డీఆర్ఎఫ్ బృందం, తదితర శాఖల అధికారులు పాల్గొన్నారు.

ఈవీఎం గోడౌన్‌ను తనిఖీ చేసిన కలెక్టర్

ఖమ్మంకలెక్టరేట్: జిల్లా కలెక్టరేట్ ఆవరణలోని ఈవీఎం గోడౌన్‌ను కలెక్టర్ అనుదీప్ దురిశెట్టి శుక్రవారం తనిఖీ చేశారు. నెలవారి తనిఖీల్లో భాగంగా ఈవీఎం గోడౌన్‌ను తనిఖీ చేసి, గోడౌన్‌రూం సీల్‌ను పరిశీలించారు. అనంతరం తనిఖీ రిజిస్టర్‌లో కలెక్టర్ సంతకం చేశారు భద్రతా సిబ్బంది షిప్టుల వారీగా చేస్తున్న డ్యూటీలో ఖచ్చితంగా సమయపాలన పాటించాలని, భద్రతా సిబ్బంది ఎల్లప్పుడూ అప్రమత్తంగా ఉండాలన్నారు. కలెక్టర్ వెంట కలెక్టరేట్ ఏవో కారుమంచి శ్రీనివాసరావు, ఎన్నికల డీటీ అన్సారీ తదితరులున్నారు.

పాఠశాలలను బలోపేతం చేయాలి

- టీఎస్‌యూటీఎఫ్ జిల్లా ప్రధాన కార్యదర్శి పారుపల్లి



మాట్లాడుతున్న నాగేశ్వరరావు

నేలకొండపల్లి, జూలై4(ఆంధ్రజ్యోతి): ప్రభుత్వ బడులను బలోపేతం చేయాలని టీఎస్ యూటీఎఫ్ జిల్లా ప్రధాన కార్యదర్శి పారుపల్లి నాగేశ్వరరావు ఉపాధ్యాయులకు పిలుపునిచ్చారు. టీఎస్ యూటీఎఫ్ మండల కమిటీ ఆధ్వర్యంలో సభ్యత్వ నమోదు కార్యక్రమంలో భాగంగా శుక్రవారం ఆరెగూడెం, ఆచార్లగూడెం, రాజేశ్వరపురం, చెన్నారం, కోరట్లగూడెం, మూటాపురం, సుర్దేపల్లి పాఠశాలల్లో సభ్యత్వ నమోదును నిర్వహించారు. కార్యక్రమంలో జిల్లా కార్యదర్శి కట్టా పద్మ, రావెళ్ల అరవింద్, మండల కార్యదర్శి తొర్తి గురవయ్య, జ్యోతి, వెంకటరమణ, శ్రీను, స్వామి, కోటేశ్వరరావు, నవాబ్‌సాహెబ్ పాల్గొన్నారు.

ఘనంగా చండీహోమం

ఖమ్మంఖానాపురంహవేలి,జూలై4(ఆంధ్రజ్యోతి): గురుపౌర్ణమి వేడుకల్లో భాగంగా జిల్లాలోని పలు సాయిబాబా ఆలయాల్లో వేడుకలు నిర్వహిస్తున్నారు. నగరంలోని కృష్ణసాయి ఆశ్రమంలో శుక్రవారం చండీహోమం నిర్వహించారు గాంధీచౌక్ సాయి మందిరంతో పాటు ప్రశాంతినగర్, మమతారోడ్, కవిరాజ్‌నగర్, వీడియోకాన్‌కాలనీ ఆలయాల్లో ప్రత్యేక పూజలు నిర్వహించారు.

టెండర్ లేకుండానే సాగర్ యూటీ పనులా?

- బీజేపీ జిల్లా అధ్యక్షుడు నెల్లూరి



పాలేరు వద్ద నిర్మిస్తున్న యూటీని పరిశీలిస్తున్న బీజేపీ నాయకులు

కూసుమంచి, జూలై 4(ఆంధ్రజ్యోతి): సాగర్ ఎడమకాల్వపై పాలేరు వద్ద ఎటువంటి టెండర్ల ప్రక్రియ లేకుండానే పనులు నిర్వహిస్తున్నారని బీజేపీ జిల్లా అధ్యక్షుడు నెల్లూరి కోటేశ్వరరావు, పాలేరు అసెంబ్లీ నియోజకవర్గ ఇన్‌చార్జ్ సున్నా రవికుమార్ ఆరోపించారు. శుక్రవారం పార్టీ శ్రేణులతో కలిసి యూటీ నిర్మాణాన్ని పరిశీలించారు. ఎటువంటి టెండర్ ప్రక్రియ లేకుండానే పనులు కట్టబెట్టారని, దీనిపై తమకు అనుమానాలు ఉన్నాయని ఆరోపించారు. పారదర్శకత లేకుండా టెండర్లును పక్కనపెట్టి ఇష్టానుసారంగా పనులను అప్పగించడం న్యాయపరంగా తప్పుపట్టే అంశమని తెలిపారు. సాగర్ జలాలు నిలిపివేసిన వెంటనే పనులు ప్రారంభించాల్సి ఉన్నప్పటికీ ఆలస్యంగా ప్రారంభించారని తెలిపారు. దీంతో నీరు విడుదల చేసే సమయానికి కూడా పనులు పూర్తి చేయలేకపోయారని ధ్వజమెత్తారు. రూ.15కోట్లు ఖర్చు చేసినట్లు చెపుతున్నారని, వివరాలు అడిగితే చెప్పలేకపోతున్నారని అన్నారు. అధికారుల నిర్లక్ష్యంతో పనులు నత్తనడకన నడుస్తున్నాయని తక్షణమే వేగవంతం చేయకపోతే సాగర్ జలాలు ఆయకట్టుకు చేరక రైతులకు తీవ్రంగా పంట నష్టపోయే అవకాశం ఉందని హెచ్చరించారు. కార్యక్రమంలో బీజేపీ నాయకులు ఈవీ.రమేష్, సుబ్బారావు, రవిరాథోడ్, సుదర్శన్, హట్యానాయక్, గుత్తా వెంకటేశ్వరరావు మల్లారెడ్డి, బెల్లం మురళి, గుండా ఉపేందర్‌రెడ్డి, గడ్డం వెంకటేశ్వర్లు, తదితరులు పాల్గొన్నారు.

ఇన్ఫోసిస్‌కు ఐదుగురు విద్యార్థుల ఎంపిక



ఎంపికైన విద్యార్థులతో కళాశాల చైర్మన్

ఖమ్మంఖానాపురంహవేలి,జూలై4(ఆంధ్రజ్యోతి): ప్రముఖ సాఫ్ట్‌వేర్ సంస్థ ఇన్ఫోసిస్‌కు నగరంలోని ఎస్‌బీఐటీ కళాశాలకు చెందిన ఐదుగురు విద్యార్థులు ఎంపికైనట్లు కళాశాల చైర్మన్ గుండాల కృష్ణ శుక్రవారం తెలిపారు. గురువారం హైదరాబాదులో నిర్వహించిన రాష్ట్రస్థాయి క్యాంపస్ పుల్‌డ్రైవ్‌లో ప్రతిభ కనబరిచి ఎంపికయ్యారని తెలిపారు. ఆన్‌లైన్‌పరీక్షలో 9మంది ఎంపికకాగా, చివరి హెచ్‌ఆర్ రౌండ్‌లో ఐదుగురు అర్హత సాధించారని తెలిపారు. వీరికి ఆరునెలల పాటు శిక్షణలో భాగంగా రూ.3.6లక్షలు, అనంతరం రూ.9లక్షల వార్షిక వేతనం అందించనున్నట్లు తెలిపారు. వీరిని కళాశాల సెక్రటరీ అండ్ కరస్పాండెంట్ జి.ధాత్రి, ప్రిన్సిపాల్ రాజ్‌కుమార్, కళాశాల డైరెక్టర్లు అభినందించారు.

గంజాయి స్వాధీనం

ఖమ్మంఖానాపురంహవేలి, జూలై4 (ఆంధ్రజ్యోతి): ఖమ్మం కొత్త బస్టాండ్ సమీపంలో నలుగురిని అదుపులోకి తీసుకుని 900గ్రాముల గంజాయిని స్వాధీనం చేసుకున్నట్లు ఖమ్మం రెండో పట్టణ పోలీస్ స్టేషన్ ఇన్‌స్పెక్టర్ బాల కృష్ణ తెలిపారు. ఎస్‌ఐ సంధ్య ఆధ్వర్యంలో తనిఖీలు నిర్వహిస్తుండగా కొత్తగూడెం పట్టణానికి చెందిన అబ్దుల్ మోహిత్ అనే వ్యక్తి గంజాయిని తీసుకొచ్చి ఖమ్మం కొత్త బస్టాండ్ సమీపంలో గుట్టపై విక్రయిస్తుండగా పట్టుకున్నామన్నారు. మోహిత్ తోపాటు గంజాయి కొనుగోలుకు వచ్చిన గోపాలపురానికి చెందిన బదావత్‌ప్రవీణ్, దూర్ సందీప్, జహీర్‌పురానికి చెందిన దోన్‌వాన్ సాయి వినయ్‌లను అదుపులోకి తీసుకున్నట్లు తెలిపారు. గంజాయి విలువ రూ.30వేలు ఉంటుందని తెలిపారు.

రాష్ట్ర ఫుడ్ సేఫ్టీ టాస్క్‌ఫోర్స్ అధికారుల తనిఖీలు

- హోటళ్లల్లో బయటపడ్డ డొల్లతనం
- శాంపిల్స్ సేకరించిన రాష్ట్ర అధికారి జ్యోతిర్మయి



శాంపిల్స్ సేకరించిన జ్యోతిర్మయి

ఖమ్మంసంక్షేమవిభాగం, జూలై4(ఆంధ్రజ్యోతి): రాష్ట్రస్థాయి ఫుడ్ సేఫ్టీ టాస్క్‌ఫోర్స్ అధికారుల బృందం ఖమ్మంలో తనిఖీలు చేయటంతో ఐస్‌ప్లార్లర్‌ల నుంచి హోటల్స్ స్వీట్ దుకాణాల వరకు డొల్లతనం బయటపడింది. జిల్లా ఫుడ్ సేఫ్టీ అధికారులు మొక్కు బడి తనిఖీలు చేస్తూ ప్రజలను మభ్య పెడుతూ ఉండటతో ఇటీవల కాలంలో ఖమ్మం జిల్లా నుంచి రాష్ట్ర స్థాయిలోని అధికారులకు ఫిర్యాదులు వెళ్లాయి. దీంతో రెండు రోజులుగా ఖమ్మంలోనే మకాం వేసిన అధికారులు శుక్రవారం తనిఖీలు చేపట్టారు. పాలమూరు గ్రీల్స్ రెస్టారెంట్‌లో వంటగది అపరిశుభ్రంగా ఉండటంతో పాటుగా రిఫ్రిజరేటర్లు, కోల్డ్ చాంబర్‌లో ఫుడ్ ప్రమాణాల మేరకు నిర్వాహణ చేపట్టలేదు. దీంతో ఫుడ్ సేఫ్టీ అధికారి జ్యోతిర్మయి నోటీసులు జారీ చేశారు. వైరా రోడ్డులోని పీఎస్‌కే ఫుడ్‌లో విస్తృతంగా తనిఖీలుచేశారు. పరిశుభ్రత పాటించకపోవటంతో సరైన వెలుతూరు నిర్వహణ లేకపోవటం, ప్లాస్టిక్ డ్రమ్‌లో పచ్చళ్లు నిల్వ ఉంచటంతో ముడి సరుకులపై ఈగలు వాలటంతో శ్యాంపిల్స్ సేకరించి హైదరాబాద్ ల్యాబ్‌కు పంపారు. వైరా రోడ్డులోని ఐబాక్ ఐస్‌క్రీమ్‌లో సరైన లైసెన్స్ లేక పోవటంతో, ఐస్‌క్రీములు, చాక్లెట్లు నిల్వ ఉంచటం, ఎక్స్‌పైర్ డేట్‌లు కనిపించకపోవటంతో నోటీసులు జారీ చేశారు. ఎన్టీఆర్ సర్కిల్‌లోని జీపీరెడ్డి స్వీట్ దుకాణంలో అపరిశుభ్రతతో కేక్‌లు తయారీని గుర్తించారు. హానికరమైన రంగులు, ప్లాస్టిక్ బకెట్లు క్రీములను నిల్వలు, కాలం చెల్లిన చెర్రిస్, ఫ్రూట్ క్రసెస్ గుర్తించారు. ప్రజల ఆరోగ్యం నిమిత్తం అక్కడికక్కడే ధ్వంసం చేశారు. రూ.30వేల పదార్థాలను సీజ్ చేశారు. ఈ సందర్భంగా రాష్ట్ర ఫుడ్‌సేఫ్టీ అధికారి వంకాయలపాటి జ్యోతిర్మయి మాట్లాడుతూ ప్రజల్ని వ్యాపారులు అనేక రకాలుగా మోసాలు చేస్తూ ఆర్గానిక్ పేరుతో తయారు చేసి ఆహార ఉత్పత్తులను కొనుగోలు చేసి ప్రజలు మోసపోవద్దని హితవు పలికారు. ఈ తనిఖీల్లో రోహిత్ రెడ్డి, స్వాతి, శ్రీషిక, లోకేష్, శరత్ పాల్గొన్నారు.

ఆంగ్ల బోధనలో నైపుణ్యం పెంచుకోవాలి

ఖమ్మంఖానాపురంహవేలి, జూలై4 (ఆంధ్రజ్యోతి): ప్రభుత్వ పాఠశాలల్లో పని చేస్తున్న ఉపాధ్యాయులు ఆంగ్ల భాషాబోధనలో నైపుణ్యం పెంపొందించుకోవాలి జడ్పీ సీఈఓ దీక్షారైనా అన్నారు. ఉ కెన్ లెర్న్ కార్యక్రమాన్ని ఈ ఏడాది అధనంగా 48 పాఠశాలలో ప్రారంభిస్తున్న సందర్భంగా ఆయా పాఠశాలల ఆంగ్ల బోధన ఉపాధ్యాయులకు శుక్రవారం నగరంలోని శాంతినగర్ లో నిర్వహించిన సదస్సులో మాట్లాడారు. విద్యార్థులలో ఆంగ్ల భాషా పరిజ్ఞానాన్ని పెంపొందించాల్సిన ఆవశ్యకత ఉందన్నారు. అందరూ అంకితభావంతో పని చేయాలని అన్నారు. ఈ కార్యక్రమంలో జిల్లా విద్యాశాఖ అధికారి కె. సత్యనారాయణ, కోఆర్డినేటర్ యలగందులు. రాజశేఖర్, 48పాఠశాలల ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

లా విద్యార్థులకు అవగాహన సదస్సు

జిల్లా న్యాయసేవాధికార సంస్థ కార్యదర్శి చంద్రశేఖరరావు



మాట్లాడుతున్న చంద్ర శేఖరరావు

ఖమ్మంలీగల్, జూలై4(ఆంధ్రజ్యోతి):ఖమ్మంలోని మానేరు లాకాలేజీ విద్యార్థులకు శుక్రవారం న్యాయసేవాధికార సంస్థ ఆధ్వర్యంలో అవగాహన సదస్సు నిర్వహించారు. ఈసదస్సుకు జిల్లా న్యాయసేవాధికార సంస్థ కార్యదర్శి కేవీ చంద్ర శేఖరరావు ముఖ్య అతిథిగా పాల్గొని ప్రసంగించారు. న్యాయసేవాధికార సంస్థ నిర్వహించే కార్యక్రమాలపై అవగాహన కలిపించారు. ఆర్థిక ఇబ్బందులున్న వారికి, వెనుకబడిన వారికి న్యాయసేవాధికార సంస్థ ఉచిత న్యాయం అందస్తుందని, పారాలీగల్ వలంటీర్ బాధ్యతలను వివరించారు. వలంటీర్లుగా పేర్లు నమోదుచేసుకోవాలన్నారు. సీనియర్ న్యాయవాది పి.సంధ్యారాణి, జాతీయ న్యాయసేవాధికార సంస్థ ప్రవేశపెట్టిన లీగల్ ఎయిడ్ డిఫెన్స్ కౌన్సిల్ గురించి వివరించారు. ఈ సదస్సులో కళాశాల ప్రిన్సిపాల్ మందా చిరంజీవి, అధ్యాపకులు నూరేన్, హర్ష్, లావణ్య, రేహాన్ తదితరులు పాల్గొన్నారు.

గ్యాస్ లీకై అగ్నిప్రమాదం

ఖమ్మంఖానాపురంహవేలి, జూలై4 (ఆంధ్రజ్యోతి): నగరంలోని సుందరయ్య నగర్‌లో ఓ మహిళ వంట చేస్తుండగా గ్యాస్ లీకై అగ్నిప్రమాదం చోటు చేసుకుంది. ఈ సంఘటన శుక్రవారం జరిగింది. అగ్నిమాక అధికారి బాలకృష్ణ వివరాల ప్రకారం.. ఇంట్లోని మొదటి అంతుస్థులో ఉన్న పిట్ల. లక్ష్మీ నివాసంలో గ్యాస్ లీకై మంటలు ఎగసిపడ్డాయని, అప్రమత్తమైన కుటుంబ సభ్యులు వెంటనే అగ్నిమాపక సిబ్బందికి సమాచారం అందించటంతో సిబ్బంది అక్కడకు చేరుకోని మంటలను ఆర్పివేశారు. గ్యాస్ సిలిండర్ పేలకపోవటంతో పెనుప్రమాదం తప్పింది. ఈ ఘటనలో విలువై పత్రాలు, రూ.2లక్షల విలువైన ఆస్థి నష్టం సంభవించింది. ఎవరికి ఎటువంటి గాయాలు కాలేదు. దీంతో అంతా ఊపిరిపీల్చుకున్నారు.

సమ్మెను విజయవంతం చేయండి

టీయూసీఐ జిల్లా కార్యదర్శి రామయ్య.



సార్వత్రిక సమ్మె పోస్టర్‌ను ఆవిష్కరిస్తున్న రామయ్య

నేలకొండపల్లి, జూలై4(ఆంధ్రజ్యోతి): ఈనెల 9న కార్మికవర్గాలు తలపెట్టిన దేశవ్యాప్త సార్వత్రిక సమ్మెను విజయవంతం చేయాలని టీయూసీఐ జిల్లా కార్యదర్శి జి.రామయ్య పిలుపునిచ్చారు. శుక్రవారం నేలకొండపల్లిలో జరిగిన కార్యక్రమంలో సమ్మెకు సంబంధించిన పోస్టర్‌ను రామయ్య ఆవిష్కరించారు. 29 కార్మిక చట్టాలను మోదీ ప్రభుత్వం రద్దు చేసి, నాలుగు లేబర్ చట్టాలను ముందుకు తెచ్చిందన్నారు.కార్యక్రమంలో జిల్లా సహాయ కార్యదర్శి పగిడికత్తుల రామదాసు, పెదపాక వెంకన్న, పసుపులేటి సైదులు, హీరాలాల్, సుజాత, రఘు, వెంకటలక్ష్మి, రంగమ్మ పాల్గొన్నారు.

రోడ్డు ప్రమాదంలో తీవ్ర గాయాలు

నేలకొండపల్లి, జూలై4(ఆంధ్రజ్యోతి): మండల కేంద్రంలోని కొత్తబస్టాండ్ వద్ద శుక్రవారం మధ్యాహ్నం రెండు ద్విచక్ర వాహనాలు ఎదురెదురుగా ఢీకొన్న సంఘటనలో ఓవ్యక్తి తీవ్రంగా గాయపడ్డాడు. నేలకొండపల్లికి చెందిన వంగవేటి శ్రీనివాసరావు ఎలియాస్ అయ్యప్ప శ్రీను తన ద్విచక్రవాహనంపై కొత్తకొత్తూరు వైపు వెళుతున్నాడు. కొత్తకొత్తూరు వైపు నుంచి ద్విచక్రవాహనంపై నేలకొండపల్లి వస్తున్న వెంకటేష్ ద్విచక్ర వాహనాలు ఎదురెదురుగా ఢీకొన్నాయి. దీంతో అయ్యప్ప శ్రీనుకు తీవ్ర గాయాలైనాయి. తీవ్రంగా గాయపడిన శ్రీనును నేలకొండపల్లి ప్రభుత్వ వైద్యశాలకు తరలించారు.

రోటరీక్లబ్ ఆఫ్ ఖమ్మం సభ్యులకు అవార్డులు

ఖమ్మంఖానాపురంహవేలి, జూలై4(ఆంధ్రజ్యోతి): రోటరీక్లబ్ ఆఫ్ ఖమ్మం ప్రెసిడెంట్ నల్లమోతు రవీంద్రనాథ్‌కు హైదరాబాదులో జరిగిన డిస్ట్రిక్ అవార్డుల ప్రదానంలో రోటరీడిస్ట్రిక్ 3150 కాకతీయ బెస్ట్ ప్రెసిడెంట్ సిల్వర్ అవార్డును కమిటీ చైర్మన్ ఆర్‌టీఎన్ వి.విష్ణుబాబు, డిస్ట్రిక్ గవర్నర్ ఆర్‌టీఎన్‌కే శరత్‌చౌదరి అందజేశారు. వీరితోపాటు జిల్లాలో అనేక సేవలందించినందుకు గాను రోటరీక్లబ్ ఆఫ్ ఖమ్మానికి గోల్డ్, సిల్వర్, కాంస్య అవార్డులు అందుకున్నారు.

డీసీఈబీ సెక్రటరీగా కనపర్తి



ఖమ్మంఖానాపురంహవేలి, జూలై4(ఆంధ్రజ్యోతి): డీసీఈబీ(డిస్టిక్ కామన్ ఎగ్జామినేషన్ బోర్డ్) సెక్రటరీగా నాగులవంచ ప్రభుత్వ పాఠశాల ప్రధానోపాధ్యాయుడు కనపర్తి. వెంకటేశ్వర్లు నియమించారు. శుక్రవారం నగరంలోని రోటరీనగర్ ప్రభుత్వ పాఠశాలలో జరిగిన సమావేశంలో సెక్రటరీగా కనపర్తి వెంకటేశ్వర్లు తోపాటు 10 మంది సభ్యులను ఎన్నుకున్నట్లు జిల్లా విద్యాశాఖ అధికారి కె. సత్యనారాయణ తెలిపారు. సభ్యులుగా అన్నారుగుడెం ప్రధానోపాధ్యాయుడు ఎన్.దామోదరప్రసాద్, ఈర్లపుడి పాఠశాల ప్రధానోపాధ్యాయుడు బి.పూల్‌చంద్, నేలకొండపల్లి బాలికల పాఠశాల ప్రధానోపాధ్యాయుడు జి.రమేష్,బానాపురం పాఠశాలహెచ్‌ఎం ఈ.వెంకట్రామరెడ్డి, కొణిజర్ల పాఠశాల హెచ్‌ఎం ఎం.శాంతకుమారి, టేకులపల్లి రెసిడెన్షియల్ పాఠశాల ప్రిన్సిపాల్ ఎం.సునీత, కేజీబీవి ఖమ్మంరూరల్ నుంచి ఆసియాబేగం, ప్రైవేటు పాఠశాలల నుంచి ఆక్స్‌ఫర్డ్ పాఠశాల ఖమ్మం నుంచి జాఫర్ అలీమతిన్, గీతాంజలి విద్యానికేతన్ సత్తుపల్లి నుంచి సీహెచ్.శ్రీనివాసరావు, బాలభారతి విద్యానికేతన్ తల్లాడ నుంచి కె.ప్రవీన్‌ను ఎన్నుకున్నారు. ఈ కమిటీ మూడేళ్ల పాటు విధులు నిర్వహిస్తుందని డీఈవో తెలిపారు.

పేదల పక్షాన పోరాడేది కమ్యూనిస్టులే

సీపీఐ జాతీయ సమితి సభ్యుడు హేమంతరావు



సీపీఐ నేత వెంకటేశ్వరావుకు నివాళులర్పిస్తున్న బాగం

తిరుమలాయపాలెం, జూలై4(ఆంధ్రజ్యోతి): ప్రజాసమస్యల పరిష్కారానికి పేదల పక్షాన నిలబడి పోరాడేది కమ్యూనిస్టులే అని సీపీఐ జాతీయ సమితి సభ్యుడు బాగం హేమంతరావు తెలిపారు. శుక్రవారం మండలంలోని కొక్కిరేణి గ్రామానికి చెందిన సాయుధ పోరాట యోధుడు సీపీఐ నేత చావా వెంకటేశ్వరరావు వర్ధంతి సభలో మాట్లాడారు. పంచారన్నారు. జిల్లాలో సీపీఐ పార్టీ విస్తరణకు కృషిచేశారన్నారు ఈకార్యక్రమంలో పార్టీ నాయకులు ఎండీ మౌలానా, దండి సురేష్, డీసీసీబీ డైరెక్టర్ చావా వేణు, మడల కార్యదర్శి రాధాకృష్ణ, శివరామకృష్ణ, జనార్ధన్, పాల్గొన్నారు.

కాకర్లపల్లిలో వైద్య పరీక్షలు



వైద్య పరీక్షలు చేస్తున్న సిబ్బంది

సత్తుపల్లిరూరల్, జులై 3 (ఆంధ్రజ్యోతి): వానాకాలం సమీపించడంతోపాటు సీజనల్ వ్యాధులు ప్రబలుతున్న దృష్ట్యా ముందుస్తుగా గ్రామాలలో వైద్య పరీక్షలు నిర్వహిస్తున్నట్లు గంగారం పీహెచ్‌సీ వైద్యాధికారి అవినాష్ తెలిపారు. శుక్రవారం మండలంలోని కాకర్లపల్లిలో బీపీ, షుగర్‌తోపాటు జ్వరపీడితులను గుర్తించి పరీక్షలు నిర్వహించి రోగులకు ఉచితంగా మందులు పంపిణీ చేశారు. కార్యక్రమంలో సిబ్బంది మంజుల, అనిత, ఆశా కార్యకర్తలు పాల్గొన్నారు.

పెనుబల్లి ఆసుపత్రిలో సమస్యలు పరిష్కరించాలి

పెనుబల్లి, జూలై 4 (ఆంధ్రజ్యోతి): పెనుబల్లి ప్రభుత్వ ఆసుపత్రిలో ఏర్పడ్డా సమస్యలను తక్షణమే పరిష్కరించాలని ఐద్వా జిల్లా కమిటీ సభ్యురాలు శీలం పకీరమ్మ డిమాండ్ చేశారు. ఐద్వా మండల కార్యదర్శి మిట్టపల్లి నాగమణితో కలిసి ఆమె శుక్రవారం ఆసుపత్రిని సందర్శించి రోగుల ఇబ్బందులను అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. వర్షాకాలంలో సీజనల్ వ్యాధులు ప్రారంభం కావడంతో ఆసుపత్రిలో రోగుల సంఖ్య పెరిగిందని దానికి తగ్గట్టుగా ఆసుపత్రిలో సౌకర్యాలు లేకపోవడంతో తీవ్ర ఇబ్బందులు పడుతున్నారన్నారు. ఆసుపత్రిలో సమస్యలన్నింటిని పరిష్కరించి గ్రామాల్లో వైద్యశిబిరాలు నిర్వహించాలని డిమాండ్ చేశారు. ఐద్వా జిల్లా కమిటీ సభ్యురాలు జాజిరి జ్యోతి, నాయకులు రత్నకుమారి, తస్నీరు కృష్ణవేణి, మర్రి రజిని, గాయం తిరుపతిరావు,చిరంజీవి పాల్గొన్నారు.

అర్హులందరికీ ఇందిరమ్మ ఇళ్లు ఇవ్వాలి

వైరా, జూలై 4 (ఆంధ్రజ్యోతి): అర్హులైన తమకు ఇందిరమ్మ ఇళ్లు మంజూరు చేయాలని కోరుతూ వైరా మునిసిపాలిటీ ఒకటోవార్డులోని నిరుపేదలు శుక్రవారం తమ గుడిసెల ముందు ఆందోళన చేశారు. మునిసిపాలిటీలో నిరుపేదలమైన తమకు ఇందిరమ్మ ఇళ్లు ఇవ్వకుండా అధికార పార్టీ నాయకులు అడ్డుకున్నారని ఆరోపించారు. ఒకటోవార్డులోని తమ్మిశెట్టి లక్ష్మీ ఇంటిముందు పేదమహిళలు చేరుకుని ఈ నిరసన కార్యక్రమాన్ని నిర్వహించారు. ఇప్పటికైనా అర్హులైన తమకు ఇందిరమ్మ ఇళ్లు మంజూరు చేయాలని మహిళలు కోరారు.

ఫ్రైడే..డ్రైడే కార్యక్రమం

మధిరటౌన్, జూలై (ఆంధ్రజ్యోతి): మధిర మునిసిపాలిటీలో శుక్రవారం అన్ని వార్డుల్లో ఫ్రైడే డ్రైడే కార్యక్రమం నిర్వహించారు. మునిసిపల్ కమిషనర్ సంపత్ కుమార్ లడకబజార్‌లో ఈ కార్యమాన్ని ప్రారంభించారు, పరిసారాలు పరిశుభ్రంగా ఉంచుకోవాల్సిన బాధ్యత ప్రతి ఒక్కరిపై ఉందని వర్షాలు కురుస్తున్నందున అంటు వ్యాధులు ప్రబలే ప్రమాదం ఉందని జాగ్రత్తగా ఉండాలపి తెలిపారు. మునిసిపల్ సిబ్బంది, ఆశ వర్కర్లు, మెప్మా సిబ్బంది పాల్గొన్నారు.

'డబుల్' కేటాయింపులెప్పుడో?

- ఏరుగట్లలో మూడేళ్ల క్రితం రూ.2కోట్లతో నిర్మాణం
- నేటికీ ప్రారంభానికి నోచుకోని వైనం
- సొంతింటి కోసం ఎదురుచూస్తున్న లబ్ధిదారులు



పేదలు నివాసముంటున్న రేకుల ఇళ్లు

పెనుబల్లి, జూలై 4 (ఆంధ్రజ్యోతి): ప్రభుత్వాలు పేదలకు సొంత గూడు ఏర్పాటుచేయాలని లక్ష్యంతో నిర్మించిన ఇళ్లు ఏళ్లు గడుస్తున్నా లబ్ధిదారులకు కేటాయించకపోవడంతో నిరుపయోగంగా మారాయి. పెనుబల్లి మండలం ఏరుగట్ల గ్రామంలో 2021లో అప్పటి బీఆర్ఎస్ ప్రభుత్వం పేదప్రజల కోసం సమీకృత గిరిజనాభివృద్ధి సంస్థ ద్వారా 40ఇళ్ల నిర్మాణానికి రూ.రెండుకోట్లు మంజూరు చేశారు. ఇళ్ల నిర్మాణాలు ఏడాదిలోనే పూర్తయినప్పటికీ రెవెన్యూ అధికారులు స్వాధీనం చేసుకొని పేదలకు కేటాయించాల్సి ఉండగా మూడేళ్లగా జాప్యం చేస్తున్నారని లబ్ధిదారులు వాపోతున్నారు. కాంగ్రెస్ ప్రభుత్వమైనా స్పందించి తమకు ఇళ్లు కేటాయించాలని నిరుపేదలు ముక్తకంఠంతో కోరుతున్నారు.

గుడిసెలు, డేరాల్లో మగ్గుతున్న పేదలు...

ఏరుగట్ల గ్రామంలో నిరుపేదలైన బడుగు బలహీన వర్గాల కోసం డబుల్‌బెడ్‌రూం ఇళ్లను అప్పటి అధికారులు మంజూరు చేశారు. తాము నిర్మించుకున్న గుడిసెలు, డేరాల్లోనే నివాసముంటున్నారు. మరుగుదొడ్లు సైతం లేక మహిళలు చీరెలు అడ్డుపెట్టుకొని కాలం వెళ్లదీస్తున్నారు. వర్షాకాలం వచ్చిందంటేనే గుడిసెలు, డేరాల్లో తీవ్ర ఇబ్బందులకు గురవుతున్నామని, తమకు ఇళ్లు కేటాయించాలని కోరుతున్నారు.



ఇళ్లు కేటాయించాలని కోరుతున్న మహిళలు

ఒక్క ఇంటి నిర్మాణం కోసం నిలిచిన కేటాయింపులు సుమారు రూ.రెండుకోట్లతో 40ఇళ్లు మంజూరు కాగా వాటిలో ఏడాదిలోనే 39ఇళ్ల నిర్మాణాలు పూర్తయ్యాయి. కానీ ఒక్క ఇంటి నిర్మాణానికి విద్యుత్ హైటెన్షన్ వైర్లు అడ్డురావడంతో ఆఇంటినిర్మాణం నిల్చిపోయింది. స్థలం లేకపోవడంతో మరోచోట ఇంటి నిర్మాణం చేపట్టలేదు. విద్యుత్ హైటెన్షన్ వైర్లు తొలగించేందుకు సంబంధిత కాంట్రాక్టర్ విద్యుత్‌శాఖ అధికారులకు డీడీలు కూడా చెల్లించినా కానీ ఆశాఖ అధికారులు విద్యుత్ వైర్లు తొలగించకపోవడంతో నిర్మాణం నిల్చిపోయింది.

పూరిగుడిసెలోనే కాలం వెళ్లదీస్తున్నాం

వేముల ముత్తమ్మ



గత ప్రభుత్వం ఇళ్ల నిర్మాణం పూర్తిచేసి మూడేళ్లవుతున్నా ఎప్పటికప్పుడు ఇస్తామని అంటున్నారే తప్ప ఆచరణలో సాధ్యం కావడం లేదు. నిర్మాణాలు పూర్తయి ఇళ్లు వాడకం లేకపోవడంతో శిథిలావస్థకు చేరుతున్నాయి. ప్రస్తుతం తాము పూరిగుడిసెలోనే నివాసముంటున్నాం. తమకు ఇళ్లు కేటాయిస్తే ఎవరిఇల్లు వాళ్లం శుభ్రంగా ఉంచుకుంటూ నాలుగుకాలాల పాటు మన్నికగా ఉంటుంది. కాంగ్రెస్ ప్రభుత్వమైనా తమకు ఇల్లు కేటాయిస్తుందని ఎదురుచూస్తున్నాం.

మాకు ఇల్లు కేటాయించాలి

మంచాల కృష్ణవేణి



ఒక్క ఇల్లు నిర్మాణం జరగలేదని 39ఇళ్లు నిరుపయోగంగా మారాయి. ఇళ్ల నిర్మాణం పూర్తయి మూడేళ్లు గడుస్తున్నా ఇళ్ల కేటాయింపులు జరగకపోవడంతో దుర్భరంగా జీవనం సాగించాల్సి వస్తుంది. గుడిసెలోనే మేమెంతా కాలం వెళ్లదీస్తున్నాం. ఏళ్ల తరబడి ఆశతో ఎదురుచూస్తున్నాం. కానీ అధికారులు స్పందించటం లేదు.

రెవెన్యూ అధికారులు ఇళ్లను స్వాధీనం చేసుకోవడం లేదు

సుబ్బరాజు, ఐటీడీఏ ఏఈ

ఏరుగట్ల గ్రామంలో తమశాఖ ద్వారా 40ఇళ్లు మంజూరు కాగా 39ఇళ్లు నిర్మించామని, ఒక్కో ఇంటికి రూ.4.75లక్షల చొప్పున రూ.రూ.2.01కోట్లు కేటాయించింది. వీటితో 39ఇళ్ల నిర్మాణం పూర్తిచేశాం. ఏడాదిలోనే ఈ ఇళ్ల నిర్మాణాలు పూర్తయ్యాయి. ఒక్క ఇంటి నిర్మాణానికి హైటెన్షన్ వైర్లు అడ్డురావడంతో సంబంధితశాఖకు డీడీలు కూడా చెల్లించాం. అయినా విద్యుత్ వైర్లు తొలగించకపోవడం వలన ఆ ఒక్క ఇంటి నిర్మాణం పూర్తిచేయలేదు. పూర్తయిన ఇళ్లను రెవెన్యూ అధికారులు స్వాధీనం చేసుకోవడం లేదు.

ఇళ్లను ఇంకా పరిశీలించలేదు

నారాయణమూర్తి, తహసీల్దార్

ఏరుగట్లలో నిర్మించిన డబుల్‌బెడ్‌రూం ఇళ్లను తాను ఇంకా పరిశీలించలేదు. పరిశీలించిన తర్వాతనే లబ్ధిదారులకు కేటాయించే ప్రక్రియ చేపడతామని చెప్పారు.



ఖమ్మంపాడులో విద్యార్థులకు బ్యాగులు పంపిణీ చేస్తున్న దృశ్యం

ప్రభుత్వ పాఠశాలలో నాణ్యమైన విద్య: ఎంఈవో

మధిర రూరల్, జూలై 4 (ఆంధ్రజ్యోతి): ప్రభుత్వ పాఠశాలల్లో నాణ్యమైన విద్య అందుతుందని మండల విద్యాశాఖ అధికారి ప్రభాకర్ తెలిపారు. శుక్రవారం మధిర మండలం ఖమ్మంపాడు ప్రభుత్వ ప్రాథమిక పాఠశాలలో ఆశా జ్యోతి ఫౌండేషన్ వారి ఆధ్వర్యంలో విద్యార్థులకు వంద స్కూల్‌బ్యాగులు, నోట్‌బుక్స్‌ను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా జరిగిన కార్యక్రమంలో ఎంఈవో మాట్లాడారు. ఫౌండేషన్ సభ్యుడైన కోనా మోహన్‌రావు విద్యార్థులందరికీ వీటిని అందించటం అభినందనీయమన్నారు. విద్యార్థులు కష్టపడి చదివి ఉన్నత శిఖరాలను అధిరోహించాలని సూచించారు.

గండగలపాడులో దొడ్డి కొమరయ్య వర్ధంతి

వైరా, జూలై 4 (ఆంధ్రజ్యోతి): వైరా మునిసిపాలిటీ పదోవార్డు గండగలపాడులో శుక్రవారం తెలంగాణ పోరాటయోధుడు దొడ్డి కొమరయ్య 79వ వర్ధంతి వేడుకలను నిర్వహించారు. రైతుసంఘం జిల్లా కార్యదర్శి బొంతు రాంబాబు ఇతర నాయకులు కొమరయ్య చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. వ్యకాసం. పట్టణ కార్యదర్శి గుమ్మా నర్సింహారావు, నాయకులు కామినేని రవి, రాంబాబు, మురళీ, కృష్ణ, పల్లెబోయిన వెంకటేశ్వరరావు పాల్గొన్నారు.

యోగాసనాలతో సహజ ప్రసవం

తల్లాడ, జూలై 4 (ఆంధ్రజ్యోతి): గర్భిణీలు యోగాసనాలు ఆచరించడం వల్ల సహజ ప్రసవం అవుతుందని మండల వైద్యాధికారి డాక్టర్ వి.రత్నమనోహర్ అన్నారు. శుక్రవారం తల్లాడ మండల ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో గర్భిణీలకు వైద్యపరీక్షలు నిర్వహించి పోషకాహారం గురించి వివరించారు. దీంతోపాటు సహజ ప్రసవం కావడానికి చేయాల్సిన సాధారణ యోగాసనాలు గురించి యోగా శిక్షణ నిపుణురాలు శ్రీదేవి అవగాహన కలిపించారు. ఈ కార్యక్రమంలో హోమియో వైద్యురాలు డాక్టర్ నీలిమ, హెల్త్ సూపర్‌వైజర్లు కె.పద్మవుల్లయ్య, కమల, ఝాన్సీలక్ష్మీ, భద్రమ్మ తదితరులు పాల్గొన్నారు.

కార్మిక రంగంపై వివక్ష చూపుతున్న బీజేపీ

సత్తుపల్లి, జులై3 (ఆంధ్రజ్యోతి): కేంద్రంలో బీజేపీ అధికారంలోకి వచ్చినప్పటి నుంచి కార్మిక రంగంపై ఎన్నడూ లేనివిధంగ వివక్షత చూపుతోందని కార్మిక సంఘాల నాయకులు ఆరోపించారు. శుక్రవారం సత్తుపల్లిలో హమాలీ, భవన నిర్మాణ కార్మికుల అడ్డా వద్ద వారు మాట్లాడుతూ.. ఈనెల 9న జరుగే దేశవ్యాప్త సార్వత్రిక సమ్మెను జయప్రదం చేయాలని కోరారు. సంఘటిత, అసంఘటిత రంగాలలో సుమారు 42కోట్ల మంది కార్మికులకు సామాజిక భద్రత, కనీస వేతనాలు, ఇతర చట్టాలు అమలవుతుండగా మిగతా 35కోట్ల మంది చాలీచాలని జీతాలతో జీవితాలను వెళ్లదీస్తున్నారన్నారు. చట్టాలను, హక్కులను కాపాడుకోవడం కోసం ఈ సమ్మెను జయప్రదం చేయాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో నాయకులు అమర్లపూడి శరత్, కొలికపోగు సర్వేశ్వరరావు, హమాలీ, భవన రంగ కార్మికులు పాల్గొన్నారు.

సత్తుపల్లిలో ఘనంగా వంగవీటి జయంతి



సత్తుపల్లి, జులై3 (ఆంధ్రజ్యోతి): వంగవీటి మోహన రంగ జయంతి కార్యక్రమాన్ని సత్తుపల్లిలో శుక్రవారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా మునిసిపాలిటీ కార్యాలయం సమీపంలో ఆయన చిత్రపటానికి అభిమానులు పూలమాల వేసి నివాళులర్పించిన అనంతరం కేక్ కట్‌చేసి మిఠాయిలు పంచారు. కార్యక్రమంలో మాధురి మధు, పీఎల్.ప్రసాద్, సుంకర వాసు, పెద్దిరెడ్డి పురుషోత్తం, రామిశెట్టి కృష్ణ, తోకల సురేష్, మోహనరావు, సింగవరపు నరేష్, కపిలవాయి నాగు, మురహరి వెంకటేష్, మొక్క రాజేష్, రంగిశెట్టి చంటి, మణికంఠ, దాసరి సత్యనారాయణ, సతీష్, దాసరి రమణ, అయోధ్య, అళ్ల నరేష్, ఉప్పు రామకృష్ణ, దుర్గ తదితరులు పాల్గొన్నారు.

ఖర్గే సభకు కదిలిన కాంగ్రెస్ శ్రేణులు



వైరాలో జెండా ఊపి బస్సులను ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే రాందాస్‌నాయక్

వైరా, జూలై 4 (ఆంధ్రజ్యోతి): హైదరాబాద్‌లో జరిగే కాంగ్రెస్ క్రియాశీలక కార్యకర్తల సమ్మేళనానికి నియోజకవర్గంలోని అన్ని మండలాల నుంచి ఆ పార్టీ నాయకులు, కార్యకర్తలు తరలివెళ్లారు. కాంగ్రెస్ కార్యకర్తలు వెళ్తున్న బస్సులను ఎమ్మెల్యే మాలోతు రాందాస్‌నాయక్ జెండా ఊపి ప్రారంభించారు. రాష్ట్ర మార్క్‌ఫెడ్ మాజీ వైస్‌చైర్మన్ బొర్రా రాజశేఖర్, మునిసిపల్ మాజీ చైర్మన్ సూతకాని జైపాల్, కాంగ్రెస్ మండల, పట్టణ అధ్యక్షులు శీలం వెంకటనర్సిరెడ్డి, ఏదునూరి సీతరాములు పాల్గొన్నారు.

ఏన్కూరు, జూలై4 (ఆంధ్రజ్యోతి): ఏన్కూరు మండలం నుంచి కాంగ్రెస్ కార్యకర్తలు తరలివెళ్లారు. సభకు వెళ్లిన వారిలో మండల పార్టీ అధ్యక్షుడు స్వర్ణ నరేంద్రకుమార్, మాజీ ఎంపీటీసీలు మేడా ధర్మారావు, లచ్చిరాంనాయక్, నాయకులు గుర్రం రవి, కనిశెట్టి వెంకన్న, యండ్రాతి సాయి, కిషన్‌నాయక్, నన్నెఖాన్, పంతగాని నరేష్, భువనేశ్వరరాజు ఉన్నారు.

మధిరటౌన్, జూలై (ఆంధ్రజ్యోతి): మధిర మండలంలోని అన్ని గ్రామాల నుంచి నాయకులు తరలి వెళ్లారు. వారిలో యూత్ కాంగ్రెస్ నియోజకవర్గ అధ్యక్షుడు తూమాటి నవీన్ రెడ్డి, కిసాన్‌సెల్ అధ్యక్షులు దుంపా వెంకటేశ్వర రెడ్డి, మాజీ కౌన్సిలర్లు కోనా ధనికుమార్, మునుగోటి వెంకటేశ్వరరావు, గద్దల మాధురి మాజీ సర్పంచ్‌లు చిట్టిబాబు, హరిబాబు, కర్నాటి రామారావు, నాయకులు వంశీ, రవి, సంగయ్య, జహంగీర్, శ్రీను ఉన్నారు.

ముదిగొండ, జూలై 4 (ఆంధ్రజ్యోతి): ముదిగొండ మండలం నుంచి కూడా కాంగ్రెస్ నాయకులు, కార్యకర్తలు భారీగా తరలివెళ్లారు. వారిలో కాంగ్రెస్ మండల అధ్యక్షుడు కొమ్మినేని రమేష్‌బాబు, మాజీ జడ్పీటీసీలు బులెట్‌బాబు, పసుపులేటి దేవేంద్రం, ఉసికల రమేష్, పల్లపాటి కృష్ణ, శంబయ్య, పందిరి అంజయ్య, రాఘవ, ఉపేంద్రరావు పాల్గొన్నారు.

ఫొటోగ్రాఫర్స్ మండల కమిటీ ఎన్నిక

పెనుబల్లి, జూలై 4 (ఆంధ్రజ్యోతి): పెనుబల్లి మండల ఫొటో అండ్ వీడియోగ్రాఫర్స్ నూతన కమిటీని శుక్రవారం ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. అధ్యక్షుడిగా కానకళ్ల మధుసూదన్‌రావు, కార్యదర్శిగా చాట్ల వీరభద్రం, కోశాధికారిగా జిల్లేళ్ల కృష్ణచైతన్యలను ఎన్నుకున్నట్లు జిల్లా కమిటీ ఉపాధ్యక్షుడు మల్లెల సతీష్ తెలిపారు.

విద్యార్థులు చెడు వ్యసనాలకు దూరంగా ఉండాలి

- ఎక్సైజ్ సీఐ మేచర్ల రాధ



పేట్లు, గ్లాసులు పంపిణీ చేస్తున్న రాధ

కల్లూరు, జూలై 4 (ఆంధ్రజ్యోతి) : విద్యార్థులు మాదక ద్రవ్యాలు, చెడు వాస్యనాలకు దూరంగా ఉండాలని మెదక్ ఎక్సైజ్ సీఐ, పాఠశాల పూర్వ విద్యార్థిని మేచర్ల రాధ అన్నారు. మండలంలోని పేరువంచ ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో శుక్రవారం మాదక ద్రవ్యాల నిర్మూలనపై విద్యార్థులకు అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ చదువుకొని ఉన్నతంగా ఎదగాలని , తాను ఇదే పాఠశాలలో చదువుకున్నాని గురువులు, తల్లిదండ్రుల నేర్పిన క్రమ శిక్షణ, విద్యాబోధనతో ఉన్నతస్థాయికి ఎదిగానన్నారు. ఈ సందర్భంగా ఆమె తన అక్క సుజాత జ్ఞాపకార్థంగా పేరువంచ ఉన్నత పాఠశాలలోని విద్యార్థులకు మధ్యాహ్న భోజనానికి పేట్లు, గ్లాసులను వితరణ చేశారు. ఈ సందర్భంగా విద్యార్థులకు విందు భోజనం ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా రాధ, ఆమె తల్లిదండ్రులు మల్లేశ్వరరావు, మరియమ్మను ఉపాధ్యాయులు సత్కరించారు. కార్యక్రమంలో హెచ్ఎం సుదర్శన రావు, ఉపాధ్యాయులు ఎండి మౌలాలి, జ్యోతి, సర్వేశ్వరరావు, విశ్రాంత హెచ్ఎం మోహన్‌రెడ్డి, విద్యార్థులు, సిబ్బంది పాల్గొన్నారు.

వైభవంగా రేణుక ఎల్లమ్మ ఆలయ వార్షికోత్సవం

తల్లాడ, జూలై4(ఆంధ్రజ్యోతి): మండలంలో కేశ్వాపురం గ్రామంలో శుక్రవారం రేణుక ఎల్లమ్మ తల్లి ఆలయ వార్షికోత్సవాన్ని వైభవంగా నిర్వహించారు. ఈసందర్భంగా భక్తులు బోనాలతో ఆలయానికి చేరుకుని అమ్మవారికి మొక్కులు చెల్లించారు. ఆలయ అర్చడుడు భాస్కరాచార్యులు ప్రత్యేక పూజలు, అభిషేకాలు నిర్వహించారు. అనంతరం భక్తులకు అన్నదానం చేశారు. కార్య క్రమంలో మాజీ ఎంపీపీ దొడ్డా శ్రీనివాసరావు, సొసైటీ చైర్మన్లు రెడ్డెం వీరమోహన్‌రెడ్డి, తూము వీర భద్రరావు, మాజీ సర్పంచ్‌లు వనిగండ్ల అలేఖ్య అశోక్, శీలం కోటారెడ్డి, వజ్రాల రామిరెడ్డి పాల్గొన్నారు.

నిబంధనలకు విరుద్ధంగా సీసీ రోడ్డు నిర్మాణం

- ఆగ్రహం వ్యక్తం చేసిన డీఈ

వైరా, జూలై 4 (ఆంధ్రజ్యోతి): వైరా రిజర్వాయర్‌కు వెళ్లే రోడ్డులో శుక్రవారం నాణ్యతాప్రమాణాలకు తిలోదకాలిచ్చి చేపట్టిన సిమెంట్ కాంక్రీట్ రోడ్డు నిర్మాణం తీరుపై మునిసిపల్ డీఈ నరేష్‌రెడ్డి తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశారు. రూ.80లక్షల సుడా నిధులతో చేపట్టిన సీసీ రోడ్డు నిర్మాణంపై ఇప్పటికే అనేక విమర్శలు ఉన్నాయి. నాసిరకంగా రోడ్డు నిర్మాణం అనే శీర్షికన గతంలో 'ఆంధ్రజ్యోతి' కథనాన్ని ప్రచురించింది. ఆరు అంగుళాల మందంతో సీసీ రోడ్డు నిర్మించాల్సి ఉండగా ఐదు నుంచి ఐదున్నర అంగుళాల మందంతోనే ఈ రోడ్డును నిర్మిస్తున్నారు. శుక్రవారం ఏఈ శ్రీమాన్యతో కలిసి డీఈ రోడ్డు నిర్మాణాన్ని తనిఖీ చేశారు. నిర్మిస్తున్న రోడ్డులో పది చోట్ల కోర్ కటింగ్ తీయగా ఎక్కడా కూడా ఆరు అంగుళాల మందంతో రోడ్డు నిర్మాణం లేని విషయం బయటపడింది. ఐదు నుంచి ఐదున్నర అంగుళాల మందం మాత్రమే ఉండడంతో డీఈ తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశారు. ఈ రోడ్డు నిర్మాణ కాంట్రాక్టర్, సిబ్బందిని నిలదీశారు. ఆతర్వాత తగ్గిన మేరకు రోడ్డు మందాన్ని సరిచేయాలని ఆదేశించారు.

కౌలు రైతుల సమస్యలను పరిష్కరించాలి

బోనకల్, జూలై 4 (ఆంధ్రజ్యోతి): కౌలు రైతుల సమస్యలను పరిష్కరించాలని ఆ సంఘ రాష్ట్ర ఉపాధ్యక్షుడు జక్కుల రామారావు డిమాండ్ చేశారు. మండలంలోని గోవిందాపురం(ఎల్) గ్రామంలో శుక్రవారం జరిగిన ఆ సంఘ సమావేశంలో ఆయన మాట్లాడుతూ.. ఎన్నికల హామీలలో భాగంగా కౌలు రైతులకు భరోసా ఇస్తామని చెప్పి అమలు చేయకపోవడం దారుణమన్నారు. రైతుబంధు, రైతుబీమా పథకాలన్ని భూ యజమానులకే వస్తున్నాయని, సాగులో ఉన్న కౌలు రైతుల పరిస్థితి అగమ్యగోచరంగా మారిందని వాపోయారు. కౌలు రైతులకు ఎరువులు, విత్తనాలను సబ్సిడీపై అందించాలని కోరారు. సీపీఐ మండల కార్యదర్శి యంగల ఆనందరావు, నాయకులు ఆకేన పవన్, మదారయ్య, తిరపతయ్య పాల్గొన్నారు.

పాఠశాల అభివృద్ధికి సహకారం అభినందనీయం



స్టీల్ వాటర్ బాటిళ్లు పంపిణీ చేస్తున్న ఎంఈవో

తల్లాడ, జూలై 4 (ఆంధ్రజ్యోతి): ప్రాథమిక పాఠశాలను దత్తత తీసుకున్నప్పటి నుంచి మౌలిక సదుపాయల కల్పనకు దుగ్గిదేవర శ్రీరఘునందన్ అందిస్తున్న సహకారం అభినందనీయమని తల్లాడ మండల విద్యాశాఖధికారి ఎస్.దామోదరప్రసాద్ అన్నారు. స్వాతంత్ర సమరయోధుడు, మాజీ సర్పంచ్ దుగ్గిదేవర నరసయ్య వర్ధంతి సందర్భంగా శుక్రవారం తల్లాడ మండలం మల్లవరం ప్రాథమిక పాఠశాలలో విద్యార్థులకు స్టీల్ వాటర్ బాటిళ్లు, పండ్లు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. 2016లో పాఠశాలను శ్రీరఘునందన్ దత్తత తీసుకున్న నాటి నుంచి నిరంతరం పాఠశాల అభివృద్ధికి అందించిన సహకారం వల్ల కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల నుంచి జాతీయ, రాష్ట్రస్థాయిల్లో స్వచ్ఛ పాఠశాల పురస్కారాలు పొంది పాఠశాల ఆదర్శంగా నిలిచిందని కొనియాడారు మెరుగైన మౌలిక సదుపాయాలు, అనుభవజ్ఞులైన ఉపాధ్యాయుల సేవలను విద్యార్థులు వినియోగించుకుని ఉత్తమ ఫలితాలు సాధించాలని సూచించారు. ఈకార్యక్రమంలో పాఠశాల దత్తత స్వీకర్త దుగ్గిదేవర శ్రీరఘునందన్, హెచ్ఎం బి. హరిబాబు, అనిల్‌కుమార్, పడాల సైదులు దాసరి వీరభద్రరావు, యూత్ క్లబ్ అధ్యక్షుడు దుగ్గిదేవర అజయ్‌కుమార్, మూలగుండ్ల నాగేశ్వరరావు, గుమ్మా నరేష్, పీఆర్పీ శివ పాల్గొన్నారు.

విద్యార్థులకు బడ్జెట్ కేటాయించాలి

సత్తుపల్లిరూరల్, జులై 3 (ఆంధ్రజ్యోతి): విద్యార్థులు బంగారు భవిష్యత్ కోసం బడ్జెట్‌లో నిధులు సమకూర్చకుండా వారికి కమీషన్లు వచ్చే ప్రాజెక్టుల కోసం ప్రభుత్వం కేటాయిస్తుందని జార్జిరెడ్డి పీడీఎస్‌యూ జిల్లా నాయకులు జంపన్న ఆరోపించారు. విద్యాసంస్థల బంద్ సందర్భంగా 2వ రోజు శుక్రవారం సత్తుపల్లిలో మాట్లాడుతూ అనేక హామీలతో గద్దెనెక్కిన రేవంత్‌రెడ్డి ప్రజా సంక్షేమాన్ని, విద్యారంగాన్ని గాలికోదిలేశారన్నారు. బంద్‌లో పాల్గొన్న తమ నాయకులను అరెస్ట్ చేయడాన్ని తీవ్రంగా ఖండిస్తున్నామన్నారు. నాయకులు లత, దేవి, చక్రి, కుమార్, వర్మ, లక్ష్మణ్, జై పాల్గొన్నారు.

ఉద్యోగ భవిష్యత్తును తీర్చిదిద్దేందుకే మాస్టరీ కోర్సు

కొణిజర్ల, జుల్లై 4 (ఆంధ్రజ్యోతి): విద్యార్థులను ఉద్యోగ భవిష్యత్తును తీర్చిదిద్దేందుకు ఏఐ అండ్ జన్ ఏఐ మాస్టరీ కోర్సు దోహదపడుతుందని శ్రీకవిత పారుపల్లి ఎర్ర తెలిపారు. స్థానిక విజయ ఇంజనీరింగ్ కళాశాలలో శుక్రవారం ఏఐ అండ్ జన్ ఏఐ మాస్టరీ కోర్స్‌ను ఆమె ప్రారంభించారు. మైస్పార్క్ అకాడమీ, స్పీడ్‌లాబ్స్ సహకారంతో కోర్సును ప్రారంభించామన్నారు. కళాశాల వైస్ చైర్మన్ విజయలక్ష్మీ, కళాశాల ప్రిన్సిపాల్ చిన్నయ్య, వైస్‌ప్రిన్సిపాల్ అయేషాతరుణం, డీన్ శ్రీనివాస్, అడ్మినిస్ట్రేటీవ్ ఆఫీసర్ ఫరీద్‌బాబా పాల్గొన్నారు.

యూరియా కొరతను పట్టించుకోని అధికారులు

పెనుబల్లి, జూలై 4 (ఆంధ్రజ్యోతి): మండలంలో యూరియాను 60శాతం సహకార సంఘాలకు, 40శాతం ప్రైవేట్ డీలర్లకు ఇవ్వాల్సి ఉండగా అలాకాకుండా కొందరు డీలర్లకు మాత్రమే యూరియాను కేటాయించారని బీజేపీ జిల్లా అధికార ప్రతినిధి పడిగల మధుసూదన్‌రావు విమర్శించారు. శుక్రవారం మండలశాఖ అధ్యక్షుడు బొర్రా నర్సింహారావు అధ్యక్షతన జరిగిన సమావేశంలో ఆయన పాల్గొని మాట్లాడారు. యూరియా కృత్రిమ కొరతను డీలర్లే సృష్టించారని, అధిక ధరలకు విక్రయిస్తున్నా వ్యవసాయశాఖ అధికారులు పట్టించుకోవడం లేదని ఆరోపించారు. సొసైటీల ద్వారానే యూరియా అమ్మకాలు సాగించాలని ఆయన కోరారు. సమావేశంలో బీజేపీ నాయకులు గాయం నాగరాజు, కోట సుధాకర్, చెక్కిలాల మంగేశ్వరరావు, కాటిని శివకృష్ణ పాల్గొన్నారు.

ఉపాధిహామీ పథకానికి బీజేపీ తూట్లు



జెండాను ఎగురవేస్తున్న కాంతయ్య

కొణిజర్ల, జులై 4 (ఆంధ్రజ్యోతి): కమ్యూనిస్టుల పోరాటం ఫలితంగా అమలులోకి వచ్చిన జాతీయ ఉపాధిహామి పథకానికి బీజేపీ తూట్లు పొడుస్తోందని వ్యవసాయకార్మికసంఘం రాష్ట్ర అధ్యక్షుడు కొలికొండ కాంతయ్య విమర్శించారు. శుక్రవారం మండల కేంద్రమైన కొణిజర్లలో సిద్ది వెంకటేశ్వర్లు, వెంపటి సూర్యనారాయణ, పగిడిపల్లి ఏసుల అధ్యక్షతన వ్యవసాయకార్మిక సంఘం జిల్లా 26వ మహాసభను నిర్వహించారు. ఈ సభలో కాంతయ్య మాట్లాడుతూ.. దేశ వ్యాప్తంగా వ్యవసాయరంగాన్ని కార్పొరేట్ పరం చేసేందుకు బీజేపీ ప్రయత్నం చేస్తోందని విమర్శించారు. కార్మికులు వ్యవసాయరంగం నుంచి వైదొలిగి, ప్రత్యామ్నాయ రంగాలపై జీవన ఉపాధికోసం వెళ్లుతున్నారని తెలిపారు. ధరల పెరుగుదల వల్ల పేద, మధ్య తరగతి ప్రజలపై భారం పడిందన్నారు. విద్యా వైద్యం, సంక్షేమం పేదలకు ఆశించిన స్థాయిలో అందడంలేదని ఆరోపించారు. వ్యవసాయకార్మికులకు అన్ని సంక్షేమ పథకాలు వర్తింపచేయడంతో పాటు జాతీయ ఉపాధిహామి పథకం పనిదినాలు పెంచాలని, రోజుకు ఆరువందల రూపాయాలు కూలి ఇవ్వాలని డిమాండ్ చేశారు. పోరాటాలు లేకుండ సమస్యలు పరిష్కారం కావని, కార్మికులంతా సమస్యలు పరిష్కారం కోసం పోరాటాలకు సిద్ధంకావాలని పిలుపునిచ్చారు. సీపీఐ జిల్లా సహాయకార్యదర్శి దండి సురేష్, వ్యవసాయకార్మికసంఘం జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు పగిడిపల్లి ఏసు, తాటి వెంకటేశ్వర్లు, సీపీఐ వైరా నియోజకవర్గ ఇన్‌చార్జీ యర్రాబాబు, రైతుసంఘం జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు దొండపాటి రమేష్, కొండపర్తి గోవిందరావు, సీపీఐ జిల్లా నాయకులు జమ్ముల జితేందర్‌రెడ్డి, దండు ఆదినారాయణ, సిదినేని కరుణ కుమార్, ఏపూరి లతాదేవి, మందడపు రాణి, నిర్మల, స్వర్ణ రమేష్, తోటపల్లి సీతరాములు, పిట్టల రాంబాబు తదితరులు పాల్గొన్నారు.

ముల్కనూరు పీఏసీఎస్ అభివృద్ధి పై అధ్యయనం

- చిన్నకోరుకొండి పీఏసీఎస్ పాలక వర్గం సందర్శన

కల్లూరు, జూలై 4 (ఆంధ్రజ్యోతి): హనుమకొండ జిల్లాలోని ముల్కనూరు ప్రాథమిక సహకార సంఘం పరిధిలో అన్ని రంగాల్లో ముందుకు సాగుతుంది. ఆ క్రమంలో శుక్రవారం కల్లూరు మండల పరిధిలోని చిన్నకోరుకొండి ప్రాథమిక సహకార సంఘ పాలక వర్గం బృందం ముల్కనూరు పీఏసీఎస్‌ను సందర్శించారు. సదరు సొసైటీ పరిధిలో రైతుల కోసం చేపడుతున్న అభివృద్ధి కార్యక్రమాలలో భాగంగా విత్తన శద్ధి కర్మాగారం, రైస్ మిల్లు, పెట్రోల్ బంక్‌లను వారు సందర్శించి పరిశీలించారు. ఇంకాను సొసైటీ కార్యాలయాన్ని కూడా వారు సందర్శించి టర్నవర్‌తోపాటుగా రైతులకు ఎరువుల పంపిణీ ఇతరత్ర పరంగా ఆ సంఘం చేపడుతున్న కార్యక్రమాల పురోగతిపై చిన్నకోరుకొండి పీఏసీఎస్ పాలక బృందం సమగ్రంగా పరిశీలించి అవగాహన చేసుకున్నారు. గత ఏడాది చిన్నకోరుకొండి పీఏసీఎస్ రైతులకు రుణాల పంపిణీతోపాటుగా రుణాల రికవరిలో జిల్లా స్థాయిలోనే అగ్రగామిగా నిలిచింది. దీంతో ఈ సొసైటీ పరంగా భవిషత్తులో కార్యకాలపాలపై అధ్యయనం చేసేలా జిల్లా కేంద్ర సహకార బ్యాంకు తరుపున ఆ సంఘ బృందాన్ని సందర్శనకు పంపించారు. చిన్నకోరుకొండి సొసైటీ అధ్యక్షుడు చావా వెంకటేశ్వరరావు, ఉపాధ్యక్షుడు కనకరావు, సిఈఓ వేలాద్రి, డైరెక్టర్లు పాల్గొన్నారు.

ఫిజియోథెరపీ సేవలను సద్వినియోగం చేసుకోవాలి

బోనకల్, జూలై 4 (ఆంధ్రజ్యోతి): ఫిజియోథెరపీ సేవలను సద్వినియోగం చేసుకోవాలని ఎంఈవో దామాల పుల్లయ్య కోరారు. స్థానిక ఎంఆర్‌సీ కార్యాలయంలో శుక్రవారం ఫిజియోథెరఫీ కార్యక్రమాన్ని ఆయన పరిశీలించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ.. వారంలో మంగళవారం, శుక్రవారం ఎంఆర్‌సీలో ఫిజియోథెరపీ సేవలను అందిస్తున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో ఫిజియోథెరపీస్టు అమృత వర్షిణి, ఐఈఆర్‌పీ వల్లంకొండ రాణీ తదితరులు పాల్గొన్నారు.